గురువారం
THURSDAY
1-10-2026

జగిత్యాల JAGITIAL | పేజీలు:12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00

సంపుటి: 2 Volume:2 | సంచిక: 94 Issue: 94

Circulated to Telangana
Published from Hyderabad

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..






TX HOSPITALS
MULTI SUPER SPECIALITY HOSPITALS
మీ ఆరోగ్యం... మా బాధ్యత...
Advanced Technology
Compassionate Care
Expert Doctors
24x7 Emergency
CARE
COMPASSION
CURE
OUR BRANCHES
BANJARA HILLS
Multi Super Speciality Care & Advanced Treatments
KACHIGUDA
24x7 Emergency, ICU, Diagnostics & Family Healthcare
UPPAL
Comprehensive Multi Speciality Healthcare
MIYAPUR
Quality Care Across Multiple Specialties with Expert Doctors
TX CHILDREN'S HOSPITAL BANJARA HILLS
Specialized Care for Newborns to Teens
SPECIALITIES AVAILABLE
CARDIOLOGY
NEUROLOGY
ORTHOPEDICS
GASTROENTEROLOGY
NEPHROLOGY
UROLOGY
WOMEN'S HEALTH (Gynaecology & Obstetrics)
PEDIATRICS
ONCOLOGY (CANCER CARE)
PULMONOLOGY
ENT
OPHTHALMOLOGY (EYE CARE)
ROBOTIC SURGERY
ORGAN TRANSPLANT SERVICES
INTERNAL MEDICINE
DENTAL & MAXILLOFACIAL CARE
SKIN & COSMETIC CARE
ANAESTHESIA & PAIN MANAGEMENT
AND MANY MORE SPECIALISED SERVICES UNDER ONE ROOF
24x7 EMERGENCY CARE
ADVANCED DIAGNOSTICS & LAB SERVICES
EXPERIENCED SPECIALIST DOCTORS
CASHLESS HEALTH INSURANCE FACILITY*
Your Health. Our Priority.
Compassionate Care for You and Your Family
Contact:
9010148465
We Accept All Major Health Insurance Plans
Serving Hyderabad with Trust, Technology & Transparency
www.txhospitals.in

ఈవార్తలు
వచ్చేశాం
ఈవార్తలు యాప్‌తో..
GET IT ON Google Play

నేటి ఈవార్తలు
PRGI REGD NO: TGTEL/25/A1385
Circulated to Telangana
Published from Jagitial
NETI EVARTHALU దినపత్రిక
www.evarthalu.com

గురువారం THURSDAY 1-10-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు:12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 94 Issue: 94

01 అక్టోబర్ 2026 - గురువారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు భాద్రపద మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:09 సూర్యాస్తమయం - సా. 6:01 తిథి పంచమి మ. 12:35 వరకు తరువాత షష్ఠి సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం రోహిణి తె. 4:250 వరకు తరువాత మృగశిర యోగం సిద్ధి రా. 9:13 వరకు కరణం తైతుల మ. 12:35 వరకు గరజి రా. 11:25 వరకు వర్జ్యం రా. 8:58 నుండి రా. 10:28 వరకు దుర్ముహూర్తం ఉ. 10:07 నుండి ఉ. 10:54 వరకు మ. 2:51 నుండి మ. 3:39 వరకు రాహుకాలం మ. 1:34 నుండి మ. 3:03 వరకు యమగండం ఉ. 6:09 నుండి ఉ. 7:38 వరకు గుళికాకాలం ఉ. 9:07 నుండి ఉ. 10:36 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:33 నుండి తె. 5:21 వరకు అమృత ఘడియలు రా. 1:27 నుండి రా. 2:57 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:42 నుండి మ. 12:29 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున



# శుభ్‌మన్ గిల్ డబుల్ సెంచరీ

## 400 ఊదేశారు!

కోహ్లీ అవుటైనా.. రోహిట్' షో

అండగా రుతురాజ్ గైక్వాడ్

వెస్టిండీస్ 405 పరుగులు జుజుబీ

క్యాంప్‌బెల్ రికార్డు శతకం వృథా

..పూర్తి వివరాలు 'క్రీడావాణి' పేజీలో..

## వాట్సాప్‌లో 'పేరెంటల్ కంట్రోల్'



టీనేజర్ల భద్రతను మరింత మెరుగుపరిచే లక్ష్యంతో ప్రముఖ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సాప్ నూతన ఫీచర్లను ప్రవేశపెట్టింది. తల్లిదండ్రులు తమ పిల్లలతో కలిసి ఆన్‌లైన్ భద్రతా ప్రమాణాలను నిర్దేశించుకోవడానికి ఈ 'పేరెంటల్ కంట్రోల్స్' దోహదపడ తాయని మెటా యాజమాన్యం లోని వాట్సాప్ బుధవారం వెల్లడించింది.

న్యూఢిల్లీ: ఈ ఫీచర్లు పూర్తిగా ఐచ్ఛికమేనని, వినియోగదారుల వ్యక్తిగత సంభాషణలకు ఎప్పటిలాగే పూర్తి స్థాయి భద్రత ఉంటుందని సంస్థ స్పష్టం చేసింది. ఈ నూతన సదుపాయాల ద్వారా టీనేజర్ల ప్రొఫైల్ ఫోటోను ఎవరు చూడాలి, వారిని గ్రూపుల్లో ఎవరు చేర్చుకోవాలి వంటి తరువాయి 2 వ పేజీలో...

## నో యూపీఐ డే నిరసన రద్దు




న్యూఢిల్లీ: యూపీఐ పేమెంట్స్‌పై మర్చంట్ డిస్కౌంట్ రేట్ విధించడాన్ని నిరసిస్తూ అక్టోబర్ 2న దేశవ్యాప్తంగా తలపెట్టిన 'నో యూపీఐ డే' నిరసనను ట్రేడర్స్, బిజినెస్ అసోసియేషన్లు విరమించుకున్నాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో జరిగిన కీలక సమావేశం విజయవంతం కావడంతో ట్రేడర్లు ఈ నిర్ణయం తీసుకున్నారు. యూపీఐ లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు ఉండకూడదని, ఎండీఆర్ విధింపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్త తరువాయి 2 వ పేజీలో...

## చిన్న పొదుపు పథకాలపై వడ్డీ రేట్లు యథాతథం



న్యూఢిల్లీ: చిన్న మొత్తాల పొదుపు పథకాలపై పెట్టుబడి పెట్టే వారికి కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. 2026-27 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి (అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 31, 2026 వరకు) వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగి స్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. దీంతో గత త్రైమాసికంలో తరువాయి 2 వ పేజీలో...



## పటాకులపై పూర్తి నిషేధం లేదు

### సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుకుంటున్న నేపథ్యంలో బాణసంచా కాల్చడంపై దాఖలైన పిటిషన్‌పై సుప్రీం కోర్టు బుధవారం (సెప్టెంబర్ 30) విచారణ జరిపింది. ఈ సందర్భంగా టపాసుల వినియోగంపై అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఢిల్లీలో బాణసంచాపై పూర్తి నిషేధం విధించబోమని, అలాగని రోజంతా వాటి వాడకాన్ని అనుమతించబోమని ధర్మాసనం స్పష్టం చేసింది. బాణసంచాపై పూర్తి నిషేధం విధిస్తే కొన్ని వర్గాల మనోభావాలు దెబ్బతింటాయని కోర్టు పేర్కొంది. అదే సమయంలో, రోజంతా తరువాయి 2 వ పేజీలో...



# సిరిసిల్ల గడీని కూలుస్తాం

### పిల్ల కాకికి ఏం తెలుసు ఉండేలు దెబ్బ.. గజ్వేల్ గడీని కూల్చి చూపించాం

### బతుకమ్మ చీరల్లోనూ బీఆర్ఎస్ కమీషన్లు.. సిరిసిల్ల సభలో సీఎం రేవంత్ రెడ్డి

సిరిసిల్లలో జరిగిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు. గతంలో గజ్వేల్ గడీని కూల్చుతామని చెప్పి చేసి చూపించామని, ఇప్పుడు సిరిసిల్ల గడీని కూడా నేలమట్టం చేద్దామని సిరిసిల్ల ప్రజలకు పిలుపునిచ్చారు. కేటీఆర్‌పై వ్యక్తిగత వ్యాఖ్యలు చేస్తూ.. 'పిల్లకాకికి ఏం తెలుసు ఉండేలు దెబ్బ' అంటూ రేవంత్ రెడ్డి మండిపడ్డారు. తన విలువ ఏంటో ఫామ్‌హౌస్‌లో పడుకున్న వారి అయ్యను అడిగితే తెలుస్తుందని అన్నారు.

రాజన్న సిరిసిల్ల బ్యూరో, సెప్టెంబర్ 30 (ఈవార్తలు): గత రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో సిరిసిల్ల అభివృద్ధికి రూ.1,500 కోట్లు కేటాయించామని సీఎం తెలిపారు. సిరిసిల్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేసే నాయకుడిని భవిష్యత్తులో మంత్రిని చేస్తామని ప్రకటించారు. కాంగ్రెస్‌లో సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇస్తున్నామని చెబుతూ.. తాను సీఎం అయిన తర్వాత సీతక్క వంటి సామాన్యులకు మంత్రి పదవులు దక్కాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని సీఎం విమర్శించారు. టీవీలు, పేపర్లు, స్టార్ హోటళ్లు, ఫామ్‌హౌస్‌లు మాత్రమే సంపాదించుకున్నారని ఆరోపించారు. కరీంనగర్ కలెక్టరేట్‌ను ఇప్పటివరకు ఎందుకు పూర్తి చేయలేదని కేటీఆర్‌ను తరువాయి 2 వ పేజీలో...




## రేపు మాంసం దుకాణాలు బంద్



## బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,957 |
| వెండి (కిలో): | రూ.2,,45,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,320 |

## విశ్వవాణి



ఈ-సిగరెట్ల వినియోగం కళ్ల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని పరిశోధనలు సూచిస్తున్నాయి. కంటి ఉపరితలంపై ఉండే కన్నీటి పొరను ఈ-సిగరెట్ల నుంచి వెలువడే రసాయనాలు అస్థిరం చేయడం వల్ల కళ్లలో పొడిబారడం, మంట, చికాకు, చూపు మసకబారడం వంటి సమస్యలు తలెత్తవచ్చని అధ్యయనాలు వెల్లడించాయి. 2026లో పాలస్తీనాలో 450 మంది విశ్వవిద్యాలయ విద్యార్థులపై నిర్వహించిన అధ్యయనంలో ఈ-సిగరెట్లు, సాధారణ సిగరెట్లు రెండింటినీ వినియోగించే వారిలో పొగతాగని వారితో పోలిస్తే తీవ్రమైన కళ్ల పొడిబారే లక్షణాలు కనిపించే అవకాశం రెండింతలకుపైగా ఉన్నట్లు గుర్తించారు. ఈ-సిగరెట్ల పొగలోని పదార్థాలు కంటి ఉపరితలంలో వాపు, ఆక్సీకరణ ఒత్తిడిని పెంచడం ఇందుకు కారణం కావచ్చని పరిశోధకులు పేర్కొన్నారు.

# జగన్ కాంగ్రెస్‌లో చేరాలి

### మమత, పవార్‌కు ఆహ్వానం.. రేవంత్‌తో విభేదాలు లేవు: భట్టి



వైసీపీ అధినేత జగన్ తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి చేరే అవకాశాలున్నాయంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని రేపుతున్నాయి. జగన్, మమతా బెనర్జీ, శరద్ పవార్ వంటి కాంగ్రెస్ పార్టీ మాజీ నేతలు తిరిగి సొంత గూటికి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

కొచ్చి: వారంతా పార్టీలోకి వస్తే అందరికంటే తానే ఎక్కువ సంతోషిస్తానని అన్నారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే కాన్‌క్లేవ్ సౌత్ 2026లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డితో కలిసి పనిచేసిన విషయాన్ని గుర్తు చేసుకున్న భట్టి... జగన్‌తో నేరుగా పనిచేయకపోయినా, పాత నేతలంతా తిరిగి వస్తే దేశాన్ని, పార్టీ సిద్ధాంతాలను బలోపేతం చేసిన వారవుతారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. నేతలను కులం కోణంలో చూడకూడదని, తరువాయి 2 వ పేజీలో...

# రెడ్లకే కాంగ్రెస్ టికెట్లు

### ఎమ్మెల్సీ టికెట్లపై తీన్మార్ మల్లన్న ఫైర్.. జానారెడ్డి కుట్ర అని ఆరోపణలు

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (ఈవార్తలు): తెలంగాణలో రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించడం రాజకీయంగా వేడి పుట్టించింది. రెండు సీట్లనూ రెడ్డి సామాజిక వర్గానికే కేటాయించడంపై తెలంగాణ రాజ్య అధికార పార్టీ నేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తీవ్ర ఆరోపణలు చేశారు. దీని వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని, సీనియర్ నేత జానారెడ్డి నాటకమాడారని సంచలన వ్యాఖ్యలు చేశారు. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ స్థానానికి సామ రామ్మోహన్ రెడ్డిని, నల్గొండ-ఖమ్మం-వరంగల్ స్థానానికి రామిరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని కాంగ్రెస్ అభ్యర్థులుగా ప్రకటించింది. దీనిపై మల్లన్న మాట్లాడుతూ...



ఈ నిర్ణయం తనకు ఆశ్చర్యం కలిగించలేదన్నారు. "రెడ్ల పార్టీ రెడ్లకు కాకుండా బీసీలకు టికెట్లు ఇస్తేనే ఆశ్చర్యపడాలి" అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌లోని రెడ్లు తరువాయి 2 వ పేజీలో...



## ఏపీలో సర్ గడువు పొడిగింపు

విజయవాడ, సెప్టెంబర్ 30 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమ గడువును భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మరోసారి పొడిగించింది. తాజా ఉత్తర్వుల ప్రకారం, తుది -2 వ పేజీలో...




## రూ.299కే జియోభారత్ ఫోన్

ముంబై: రిలయన్స్ జియో 10 ఏళ్ల వార్షికోత్సవం సందర్భంగా, 2జీ వినియోగదారులను 4జీ వైపు ఆకర్షించేందుకు ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించింది. ఇందులో భాగంగా జియోభారత్ 4జీ ఫీచర్ ఫోన్‌ను కేవలం రూ. 299 ఎఫెక్టివ్ ధరకే అందిస్తోంది. దీనికోసం వినియోగదారులు తరువాయి 2 వ పేజీలో...

# మా సిద్ధాంతం మారదు

### పార్టీని జాతీయ స్థాయికి ఎందుకు విస్తరించకూడదు?

### మరో రెండేళ్లలో తెలంగాణ సీఎంగా మళ్లీ కేసీఆర్: కేటీఆర్

కొచ్చి: పార్టీ పేరును టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌గా మార్చినంత మాత్రాన తమ సిద్ధాంతం, ఆలోచనా విధానం, నాయకత్వం మారబోవని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. "నా పేరు షారుఖ్ ఖాన్ అని పెట్టుకుంటే నేను షారుఖ్ ఖాన్ అయిపోతానా?" అని ఆయన ప్రశ్నించారు. ఇండియా టుడే కాన్‌క్లేవ్‌లో మాట్లాడిన ఆయన, పార్టీ పేరు మార్పుపై వివరణ ఇచ్చారు. తెలుగు సినిమాలు పాన్-ఇండియా స్థాయిలో విజయం సాధిస్తున్నప్పుడు, తెలుగు గడ్డపై పుట్టిన రాజకీయ పార్టీ తరువాయి 2 వ పేజీలో...



# రాజస్థాన్‌తో ఒప్పందం వద్దు

### సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు లేఖ

### 800 మెగావాట్ల విద్యుత్ కేటాయింపుపై తీవ్ర అభ్యంతరం

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (ఈవార్తలు): మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే టి. హరీశ్ రావు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. సింగరేణి నుంచి రాజస్థాన్‌కు విద్యుత్ సరఫరా చేసేందుకు కుదుర్చుకున్న ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్యుత్ రంగ నిర్వహణలో విఫలమైందని తీవ్రంగా విమర్శించారు. మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ విస్తరణలో భాగంగా ఉత్పత్తి అయ్యే 800 మెగావాట్ల విద్యుత్‌ను రాజస్థాన్‌కు చెందిన సంస్థకు కేటాయించడంపై హరీశ్ రావు తరువాయి 2 వ పేజీలో...



## రాశి ఫలాలు

1.10.2026

మేషం: వ్యాపారమున పెట్టుబడుల విషయంలో పునరాలోచన చెయ్యాలి. వాహన ప్రయాణాలలో జాగ్రత్త వహించాలి. ముఖ్యమైన వ్యవహారాలు నత్తనడకన సాగుతాయి. ఉద్యోగాలలో అధికారులతో చిన్నపాటి వివాదాలుంటాయి. బంధువులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది.

వృషభం: వ్యాపారాలు విస్తరణకు కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు అందుతాయి. దూరపు బంధువుల నుండి ఆశ్చర్యకరమైన విశేషాలు తెలుస్తాయి. ఉద్యోగాలలో ఆశించిన పదవులు పొందుతారు. విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. చిన్ననాటి మిత్రుల నుంచి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి.

మిధునం: గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. చేపట్టిన వ్యవహారాలు సాఫీగా సాగుతాయి. వ్యాపారాలు సంతృప్తికరంగా సాగుతాయి. ఉద్యోగాలలో హోదాలు పెరుగుతాయి. ప్రముఖులతో పరిచయాలు విస్తృతమౌతాయి. ఆర్థికాభివృద్ధి కలుగుతుంది. బందుమిత్రులతో సక్యతగా వ్యవహరిస్తారు.

కర్కాటకం: ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. దూరప్రయాణాలు వాయిదా పడుతాయి. సోదరులతో స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి. దైవచింతన కలుగుతుంది. వ్యాపార, ఉద్యోగాలలో ఒత్తిడులు తప్పవు. ఆర్థిక పరిస్థితి కొంత నిరుత్సాహ పరుస్తుంది. సన్నిహితులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది.

సింహం: వ్యాపారాలలో స్వల్ప ఇబ్బందులుంటాయి. ఆర్థిక లావాదేవీలు నిరుత్సాహపరుస్తాయి. చేపట్టిన పనులలో శ్రమ తప్పదు. ఉద్యోగాలలో అదనపు బాధ్యతల వలన తగిన విశ్రాంతి ఉండదు. ప్రయాణాలలో ఆకస్మిక మార్పులు ఉంటాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

కన్య: వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి. ప్రయాణాలలో నూతన పరిచయాలు కలుగుతాయి. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. సన్నిహితులతో శుభకార్యాలలో పాల్గొంటారు. మొండి బాకీలు వసూలవుతాయి. వృత్తి ఉద్యోగాలలో మీ ప్రతిభ వెలుగులోకి వస్తుంది.

తుల: ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. పాత మిత్రులతో మాటపట్టింపులు కలుగుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగాలలో ఆకస్మిక మార్పులుంటాయి. చేపట్టిన పనులలో అవాంతరాలు కలుగుతాయి. ఋణయత్నాలు వేగవంతం చేస్తారు.

వృశ్చికం: చిన్ననాటి మిత్రులతో శుభకార్యాలలో పాల్గొంటారు. సమాజంలో పేరు కలిగిన వ్యక్తులతో పరిచయాలు విస్తృతమవుతాయి. వ్యాపారాలలో లాభాలు అందుకుంటారు. ఉద్యోగాలలో సమస్యల నుండి బయటపడతారు. నూతన వాహనాలు కొనుగోలు చేస్తారు. సోదరులతో ఆస్తి వివాదాలు పరిష్కారమౌతాయి.

ధనస్సు: వ్యాపారాలలో శ్రమాధిక్యత పెరుగుతుంది. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు. పాత ఋణాలు తీర్చడానికి నూతన ఋణాలు చేయాల్సి వస్తుంది. ఉద్యోగాలలో అదనపు బాధ్యతల వలన తగిన విశ్రాంతి ఉండదు. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. చేపట్టిన పనుల్లో అవాంతరాలు కలుగుతాయి.

మకరం: నిరుద్యోగుల కష్టం ఫలిస్తుంది. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. నూతన వస్తు లాభాలు పొందుతారు. ఉద్యోగాలలో పురోగతి కలుగుతుంది. కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో పాల్గొంటారు. ఋణగ్రస్తుల నుండి రావలసిన సొమ్ము వసూలవుతుంది.

కుంభం: చిన్ననాటి మిత్రుల నుంచి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో మరింత అనుకూల వాతావరణం ఉంటుంది. నిరుద్యోగులకు నూతన ఉద్యోగ అవకాశములు దక్కుతాయి. ప్రముఖులతో పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి. సోదరులతో ఆస్తి వివాదాలు పరిష్కారమౌతాయి.

మీనం: ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలు నిరుత్సాహపరుస్తాయి. చేపట్టిన వ్యవహారాలలో స్వల్ప అవాంతరాలు కలుగుతాయి. ఉద్యోగాలలో అధికారులతో వివాదాలు తప్పవు. నూతన ఋణాలు చేస్తారు. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. ఇంటాబయట గందరగోళ పరిస్థితులుంటాయి.

# ఏపీలో సర్ గడువు పొడిగింపు

మొదటి పేజీ తరువాయి

ఓటర్ల జాబితాను 2026 అక్టోబర్ 16న ప్రచురించనున్నారు. గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ ప్రక్రియ అక్టోబర్ 9న పూర్తి కావాల్సి ఉండగా, తాజాగా మరో వారం పాటు గడువు పెంచడం గమనార్హం. కొత్త షెడ్యూల్ ప్రకారం, ఓటర్ల జాబితాపై అందిన అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కార గడువును అక్టోబర్ 10 వరకు పొడిగించారు. ఈ గడువులోగా వచ్చిన అన్ని దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఈసీ ఆదేశించింది. పెండింగ్‌లో ఉన్న విచారణలు (హియరింగ్‌లు), ముఖ్యంగా నో-మ్యాపింగ్, లాజికల్ డిస్క్రిపెన్సీ కేసులు, ఫారం 6, 7, 8 దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా జాబితాలో నమోదు కాకుండా మిగిలిపోకూడదనే లక్ష్యంతో ఈ పొడిగింపు ఇచ్చినట్లు పేర్కొంది. కాగా, 2026 జులై 31న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించిన విషయం తెలిసిందే. మారిన తేదీల వివరాలను గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని, మీడియా ద్వారా ప్రజలకు



విస్తృతంగా ప్రచారం కల్పించాలని ఈసీ అధికారులను సూచించింది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు మేఘాలయ వంటి ఇతర రాష్ట్రాల్లో కూడా ఓటర్ల జాబితా సవరణ గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది.

## సిరిసిల్ల గడీని కూలుస్తాం

మొదటి పేజీ తరువాయి

ప్రశ్నించారు. టెండర్లు దక్కించుకుని కమీషన్లు తీసుకున్నారని, చివరకు బతుకమ్మ చీరల తయారీలోనూ కమీషన్లు తీసుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 'పుట్టింటి సారె' పేరుతో ఆడబిడ్డలకు నాణ్యమైన చీరలు అందిస్తున్నామని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో కొనసాగిస్తున్నామని చెప్పారు. అసెంబ్లీలో స్పీకర్‌ను దూషించి అవమానించిన ఘనత బీఆర్ఎస్ నాయకులదేనని రేవంత్ రెడ్డి విమర్శించారు. ఎర్రవల్లిలో దళితులు డప్పు కొడితే ఆ ప్రాంతాన్ని పసుపు నీళ్లతో కడిగి అణగదొక్కారని ఆరోపించారు. దళితులంటే బీఆర్ఎస్‌కు అంత చిన్నచూపా అని ప్రశ్నించారు. ఎర్రవల్లి భూముల ఆక్రమణలతో పాటు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, సంతోష్‌రావుల అక్రమాస్తులపై లెక్కలు తేలుస్తున్నామని సీఎం అన్నారు. 'ఎట్ హోమ్', 'దక్కన్ స్టార్ హోటల్స్' పేరుతో ఉన్న ఆస్తులు వారి పేర్లకు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. అసెంబ్లీలో సమయం లేక కొన్ని విషయాలు చెప్పలేకపోయామని, త్వరలో 'పార్ట్-2'లో అన్ని వివరాలు బయటపెడతామని ప్రకటించారు.




## రూ.299కే జియోభారత్ ఫోన్

మొదటి పేజీ తరువాయి

మొదట రూ. 1,499 చెల్లించి ఈ ఫోన్ కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అయితే, దీంతో పాటు ఆరు నెలల పాటు ఉచితంగా లభించే రీఛార్జ్ ప్యాక్ విలువ రూ. 1,200 వరకు ఉంటుంది. సాధారణంగా 2జీ వినియోగదారులు ఆరు నెలల రీఛార్జ్‌ల కోసం ఎలాగూ రూ. 1,200 ఖర్చు చేస్తారు కాబట్టి, ఆ మొత్తాన్ని ఫోన్ ధర నుండి మినహాయిస్తే ఫోన్ అసలు ధర రూ. 299 మాత్రమే పడుతుందని జియో భావిస్తోంది. ఈ పండుగ సీజన్ ఆఫర్ కింద యూజర్లకు నెలకు 14జీబీ డేటా, అపరిమిత హెచ్‌డీ వాయిస్ కాల్స్ ఉచితంగా లభిస్తాయి. 2,000ఎంఏహెచ్ బ్యాటరీతో వచ్చే ఈ ఫోన్ కేవలం కాలింగ్, టెక్స్టింగ్‌కే పరిమితం కాకుండా, జియోటీవీ ద్వారా 500కి పైగా టీవీ ఛానెళ్లు, జియోహాట్‌స్టార్‌లో లైవ్ క్రికెట్, సినిమాలు చూసే వెసులుబాటు ఉంది.

## పటాకులపై పూర్తి నిషేధం లేదు

మొదటి పేజీ తరువాయి

బాణసంచా కాల్చడానికి అనుమతిస్తే వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు, పిల్లలతో సహా ప్రతి ఒక్కరిపైనా తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. బాణసంచా కాల్చడానికి నిర్దిష్ట సమయాలను,అనుమతించదగిన బాణసంచా రకాలను నిర్ణయించడం ద్వారా ఒక మధ్యేమార్గాన్ని కనుగొనాలని సూచించింది. బాణసంచా తయారీలో బేరియం వినియోగం, శబ్ద స్థాయిలను (డెసిబెల్ స్థాయిలు) పరిశీలించేందుకు సంయుక్త పరీక్షలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలిని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ వ్యవహారానికి సంబంధించి తదుపరి విచారణను అక్టోబర్ 15వ తేదీకి న్యాయస్థానం వాయిదా వేసింది.



## రేపు మాంసం దుకాణాలు బంద్

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (ఈవార్తలు): మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని 2026 అక్టోబర్ 2న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలోని అన్ని మాంసం విక్రయశాలలు, వధశాలలను మూసివేయాలని అధికారులు ఆదేశించారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఆదేశాల ప్రకారం, జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న గొర్రెలు, మేకలు, పశువుల వధశాలలతో పాటు అన్ని రకాల రిటైల్ మాంసం, బీఫ్ దుకాణాలను అక్టోబర్ 2న పూర్తిగా మూసివేయాల్సి ఉంటుంది. జీహెచ్ఎంసీ చట్టం-1955లోని సెక్షన్ 533(బి) ప్రకారం, స్టాండింగ్ కమిటీ తీర్మానం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. ఈ నిబంధనలను కఠినంగా అమలు చేసేందుకు తమ సిబ్బందికి సహకరించాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్లను జీహెచ్ఎంసీ కోరింది.

## వాట్సాప్‌లో 'పేరెంటల్ కంట్రోల్'

మొదటి పేజీ తరువాయి

అంశాలను తల్లిదండ్రులు పర్యవేక్షించవచ్చు. ఈ సెట్టింగ్స్‌లో మార్పులు చేయాలంటే తల్లిదండ్రులు నిర్దేశించిన 'పిన్' తప్పనిసరి. అంతేకాకుండా, పిల్లలు కొత్త గ్రూపులో చేరినా లేదా వాటి నుంచి వైదొలిగినా తల్లిదండ్రులకు తక్షణ సమాచారం (అలర్ట్) అందుతుంది. ఛానెల్స్, స్టేటస్ అప్‌డేట్స్ వినియోగంపై కూడా పరిమితులు విధించుకోవచ్చు. వీటితో పాటు మెటా ఏఐ "లిమిటెడ్ కంటెంట్" ఆప్షన్‌ను ఎంచుకునే సౌలభ్యాన్ని కూడా కల్పించారు. ఈ నియంత్రణలు అమలులో ఉన్నప్పటికీ, టీనేజర్ల వ్యక్తిగత మెసేజ్‌లు, కాల్స్ గోప్యతకు ఎటువంటి భంగం కలగదని వాట్సాప్ భరోసా ఇచ్చింది. అవి ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్షన్ విధానంలోనే ఉంటాయని, తల్లిదండ్రులు లేదా వాట్సాప్ సంస్థ వాటిని చదవడం లేదా వినడం సాధ్యం కాదని పేర్కొంది. ఈ ఫీచర్ల ప్రధాన ఉద్దేశం నిఘా పెట్టడం కాదని, ఆన్‌లైన్ భద్రతపై కుటుంబ సభ్యుల మధ్య ఆరోగ్యకరమైన చర్చను ప్రోత్సహించడమేనని కంపెనీ వివరించింది. ఈ ఫీచర్ల లభ్యత ఆయా ప్రాంతాలను బట్టి మారుతూ ఉంటుందని సంస్థ స్పష్టం చేసింది.

## జగన్ కాంగ్రెస్‌లో చేరాలి

మొదటి పేజీ తరువాయి

తామిద్దరం ఐక్యంగా, సమష్టి నిర్ణయాలతో ప్రభుత్వాన్ని నడుపుతున్నామని వివరించారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వంపై భట్టి తీవ్ర విమర్శలు చేశారు. తాము చెల్లించే ప్రతి రూపాయి పన్నుకు బదులుగా తెలంగాణకు కేవలం 43 పైసలు మాత్రమే తిరిగి వస్తున్నాయని ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతోందని, సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తోందని మండిపడ్డారు. ఇదే సమయంలో, ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలు జరుగుతున్నాయని, ఇది బీజేపీకి లబ్ధి చేకూర్చేలా ఉందని ఆరోపిస్తూ... చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలను ఆయన సమర్థించుకున్నారు. ఇవి ఉచితాలు కావని, పేదలకు ఆత్మగౌరవాన్ని ఇచ్చి, వారి కొనుగోలు శక్తిని పెంచడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే చర్యలని స్పష్టం చేశారు.

# మా సిద్ధాంతం మారదు

మొదటి పేజీ తరువాయి

కూడా జాతీయ స్థాయిలో ఎందుకు విస్తరించకూడదని కేటీఆర్ అన్నారు. తెలంగాణలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను దేశంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించాలనే ఉద్దేశంతోనే పార్టీ పేరు మార్చామని తెలిపారు. రెండేళ్లలో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని, కాంగ్రెస్ పాలనపై ప్రజలు పూర్తిగా విసిగిపోయారని ఆయన జోస్యం చెప్పారు. తదుపరి సీఎం కేసీఆరేనని, తాను కాదని ప్రజలు కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ, కాంగ్రెస్‌లపై కేటీఆర్ విమర్శలు గుప్పించారు. మత ప్రాతిపదికన దేశాన్ని విభజించేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. ప్రజలు పూజించే రాముడు, శివుడి మధ్య తేడాలు సృష్టించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఉద్యోగాల కల్పన, ఎన్నికల హామీల అమలు వంటి ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించడమే ఈ రెండు జాతీయ పార్టీల విధానమని విమర్శించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎన్నికల సంఘం విశ్వసనీయతపై తీవ్రమైన సందేహాలు తలెత్తుతున్నాయని కేటీఆర్ అన్నారు. ఈసీ పనితీరుపై ఇటీవల ఓ జాతీయ మీడియా చేసిన పరిశోధనలో వెల్లడైన అంశాలు నిజమేనని చాలామంది నమ్ముతున్నారని, దీనిపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర ప్రజా వ్యతిరేకత ఉందని, అయితే ప్రధాన ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ యువతతో కలిసి నడవడంలో విఫలమయ్యారని విమర్శించారు.

## చిన్న పొదుపు పథకాలపై వడ్డీ రేట్లు యథాతథం

మొదటి పేజీ తరువాయి

అమలైన వడ్డీ రేట్లే మరో మూడు నెలల పాటు కొనసాగనున్నాయి. ఈ నిర్ణయంతో పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్)పై వడ్డీ రేటు 7.1 శాతం వద్ద స్థిరంగా ఉండనుంది. ఇక సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ (ఎస్‌సీఎస్ఎస్), సుకన్య సమృద్ధి యోజన (ఎస్ఎస్‌వై) పథకాలపై అత్యధికంగా 8.2 శాతం వడ్డీ లభించనుంది. అదేవిధంగా, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎన్ఎస్‌సీ)పై 7.7 శాతం, కిసాన్ వికాస్ పత్ర (కేవీపీ)పై 7.5 శాతం వడ్డీ రేటు కొనసాగుతాయి. వీటితో పాటు పోస్టాఫీస్ టైమ్ డిపాజిట్లు, రికరింగ్ డిపాజిట్లపై కూడా పాత వడ్డీ రేట్లే వర్తించనున్నాయి. ప్రభుత్వ సెక్యూరిటీల రాబడులకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ప్రతి త్రైమాసికానికోసారి ఈ వడ్డీ రేట్లను సమీక్షిస్తుంది. అయితే, దీనిపై తుది నిర్ణయం తీసుకునే అధికారం ప్రభుత్వం వద్దే ఉంటుంది.

## రాజస్థాన్‌తో ఒప్పందం వద్దు

మొదటి పేజీ తరువాయి

తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్లాంట్‌కు అవసరమైన బొగ్గు సింగరేణి గనుల నుంచి, నీరు గోదావరి నది నుంచి సేకరిస్తున్నారని, అలాగే భూమి కూడా తెలంగాణదేనని వ్యాఖ్యానించారు. రాష్ట్ర వనరులతో ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌ను మన అవసరాలకు వినియోగించకుండా వేరే రాష్ట్రానికి కేటాయించడంపై నిలదీశారు. తెలంగాణలో విద్యుత్ కోతలతో రైతుల పంటలు ఎండిపోతుంటే, రాష్ట్రంలో తక్కువ ఖర్చుతో ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌ను ఇతర రాష్ట్రాలకు ఇవ్వడానికి సిద్ధపడటం దారుణమని హరీశ్ రావు అన్నారు. 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు రైతులకు కనీసం 7-8 గంటలు కూడా ఇవ్వలేని పరిస్థితి నెలకొందని ఆరోపించారు. తెలంగాణ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, ఈ ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలని తన లేఖలో స్పష్టం చేశారు.

## రెడ్లకే కాంగ్రెస్ టికెట్లు

మొదటి పేజీ తరువాయి

ఓ నాటకమాడారని, ఈ కేటాయింపుల వెనుక జానారెడ్డితో పాటు మరో టీచర్ ఎమ్మెల్సీ, ఇంకో రెడ్డి నేత కుట్ర ఉందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రకటించిన ఇద్దరు అభ్యర్థులు కేవలం 'బలిపశువులు' మాత్రమేనని మల్లన్న అభివర్ణించారు. పార్టీ గెలవడం కాదు, రెడ్లు గెలవాలన్నదే వారి లక్ష్యమని, దీని కోసం బీఆర్ఎస్‌లోని ఒక వ్యక్తితో రహస్య ఒప్పందం కూడా కుదిరిందని ఆరోపించారు. ఈ స్థానాల్లో కాంగ్రెస్‌కు గతంలో కనీసం డిపాజిట్లు కూడా దక్కలేదని, తాను గెలిచిన తర్వాతే అక్కడ ఆ పార్టీకి గుర్తింపు వచ్చిందని గుర్తు చేశారు. ఈ ఎన్నికలు రెడ్లు, వెలమలకు, బీసీలకు మధ్య జరుగుతున్న పోరాటంగా ఆయన అభివర్ణించారు. రాష్ట్రంలో బీసీ వాదం లేదని నిరూపించే ప్రయత్నం జరుగుతోందన్నారు. తమ తెలంగాణ రాజ్య అధికార పార్టీ తరపున రెండు స్థానాల్లోనూ బీసీ అభ్యర్థులను నిలబెట్టి గెలిపిస్తామని తీన్మార్ మల్లన్న ధీమా వ్యక్తం చేశారు. తన అభ్యర్థిత్వంపై త్వరలోనే స్పష్టత వస్తుందని తెలిపారు.

## నో యూపీఐ డే నిరసన రద్దు

మొదటి పేజీ తరువాయి

సమ్మెకు వర్తక సంఘాలు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. అయితే, ఈ అంశంపై స్పందించిన కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ వర్తక సంఘాల ప్రతినిధులను చర్చలకు ఆహ్వానించారు. ఇవాళ జరిగిన ఈ సమావేశంలో




ట్రేడర్లు లేవనెత్తిన పలు డిమాండ్లపై మంత్రి సానుకూలంగా స్పందించడంతో అక్టోబర్ 2 నిరసనను పూర్తిగా రద్దు చేసుకుంటున్నట్లుఇవ అసోసియేషన్లు ప్రకటించాయి. కేంద్ర మంత్రితో జరిగిన భేటీలో వర్తక సంఘాల ప్రతినిధులు ప్రధానంగా రెండు కీలక డిమాండ్లను పెట్టారు. డిజిటల్ పేమెంట్స్‌పై ప్రస్తుతం ఉన్న జీరో ఛార్జెస్ పరిమితిని రూ.1 లక్ష నుంచి రూ. 5 లక్షలకు పెంచాలని కోరారు. వ్యాపారుల మధ్య జరిగే లావాదేవీలను ఎండీఆర్ పరిధి నుంచి పూర్తిగా మినహాయించాలని విజ్ఞప్తి చేశారు. అయితే, ట్రేడర్లు లేవనెత్తిన సమస్యలను పరిశీలించిన కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ వారి డిమాండ్ల పట్ల సానుకూలంగా స్పందించినట్లుగా తెలుస్తోంది.

# సర్.. డిక్లరేషన్ అక్కర్లేదు

## కొత్త ఓటర్లకు తల్లిదండ్రుల వివరాలు వద్దు: ఈసీ

న్యూఢిల్లీ: కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునే వారికి ఎన్నికల సంఘం (ఈసీ) కీలక మార్పు చేసింది. 'ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ' (సర్) పూర్తయిన 20 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో కొత్త ఓటర్లు ఇక తల్లిదండ్రులు, తాతలు, నానమ్మల ఓటరు జాబితా వివరాలు సమర్పించాల్సిన అవసరం లేదు. ఈ మేరకు ఫారం-6లో మార్పులు చేసింది. ఇప్పటివరకు కొత్త ఓటరు పేరు ఓటర్ల జాబితాలో చేర్చేందుకు సాధారణ ఫారం-6 సరిపోయేది. అయితే 'సర్' ప్రక్రియ సమయంలో ఫారం-6తో పాటు అదనపు డిక్లరేషన్ తీసుకున్నారు. గతంలో ఉన్న ఓటర్ల జాబితాతో తమ కుటుంబానికి ఉన్న సంబంధాన్ని నిర్ధారించేందుకు తల్లిదండ్రులు లేదా తాతల వివరాలు ఇవ్వాలని అందులో కోరారు. 'సర్' పూర్తయిన రాష్ట్రాల్లో ఇప్పుడు ఈ అదనపు డిక్లరేషన్ అవసరం ఉండదు. బిహార్, పశ్చిమ బెంగాల్ సహా 20 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో సర్ పూర్తయిందని ఈసీ తెలిపింది. సర్ సమయంలో పేరు జాబితాలో లేని వారు, అలాగే కొత్తగా ఓటు హక్కు పొందిన యువత, తొలిసారి ఓటు వేయబోయే వారు నిరంతర అప్‌డేషన్ ప్రక్రియలో పేర్లు నమోదు చేసుకోవచ్చు. అయితే 'సర్' ఇంకా కొనసాగుతున్న రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో మాత్రం ఈ నిబంధన కొనసాగుతుంది. అక్కడ కొత్త ఓటర్లు ఫారం-6తో పాటు 'సర్'కు సంబంధించిన డిక్లరేషన్ సమర్పించాల్సి ఉంటుంది. గత ఓటర్ల జాబితాతో తమ సంబంధాన్ని చూపించే వివరాలను కూడా ఇవ్వాలి. ఫారం-6లో మార్పులపై ఈసీలో విభేదాలు ఉన్నట్లు వచ్చిన వార్తల నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అదనపు డిక్లరేషన్‌పై అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చాయి. అయితే ఫారం-6, 'సర్'కు సంబంధించిన నిర్ణయాలు ముగ్గురు కమిషనర్ల ఏకగ్రీవ నిర్ణయాలేనని ఈసీ స్పష్టం చేసింది. సెప్టెంబర్ 26న విడుదల చేసిన వివరణలో సర్ డిక్లరేషన్‌ను సుప్రీంకోర్టు సమర్థించిందని ఈసీ పేర్కొంది. సర్ పూర్తయిన ప్రాంతాల్లో, అలాగే ఇంకా ప్రారంభం కాని ప్రాంతాల్లో అదనపు డిక్లరేషన్ అవసరం లేదని తెలిపింది. తాజా మార్పుతో సర్ పూర్తయిన రాష్ట్రాల్లో కొత్త ఓటర్లు ఇక సాధారణ ఫారం-6 ద్వారానే నమోదు చేసుకోవచ్చు. అదనంగా కుటుంబానికి సంబంధించిన పాత ఓటర్ల జాబితా వివరాలు ఇవ్వాల్సిన అవసరం ఉండదు.

# కాంగ్రెస్ జెండాతో బీఆర్ఎస్ ఎమ్మెల్యే!

## సీఎం సభకు జన సమీకరణలో సంజయ్ కుమార్.. రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ

జగిత్యాల, సెప్టెంబర్ 30 (ఈవార్తలు): బీఆర్ఎస్ పార్టీ తరఫున జగిత్యాల ఎమ్మెల్యేగా గెలిచిన డాక్టర్ సంజయ్ కుమార్ కాంగ్రెస్ పార్టీ జెండా చేతబట్టి కనిపించడం స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. బుధవారం సిరిసిల్లలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్న సభ నేపథ్యంలో జగిత్యాల నియోజకవర్గం నుంచి జన సమీకరణలో భాగంగా బస్సులు తరలించే సమయంలో సంజయ్ కుమార్ కాంగ్రెస్ జెండాను చేతబట్టి ఊపుతూ, నృత్యం చేస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో కనిపించాయి. సీఎం రేవంత్ రెడ్డితో కలిసి పనిచేస్తున్నానని సంజయ్ కుమార్ గతంలో పలుమార్లు పేర్కొన్నప్పటికీ, తాను బీఆర్ఎస్‌ను వీడినట్లు అధికారికంగా ప్రకటించలేదు. గతంలో కాంగ్రెస్ కండువాపై ప్రశ్నలు వచ్చిన సందర్భాల్లో అది పార్టీ కండువా కాదని, మూడు రంగుల కండువా మాత్రమేనని ఆయన వివరణ ఇచ్చినట్లు ప్రచారం జరిగింది. తాజాగా కాంగ్రెస్ పార్టీ గుర్తు ఉన్న జెండాతో సీఎం సభకు జన సమీకరణలో పాల్గొంటూ కనిపించడంతో ఆయన రాజకీయ వైఖరిపై మరోసారి చర్చ మొదలైంది. బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచిన ఎమ్మెల్యే కాంగ్రెస్ సభకు ఆ పార్టీ జెండాతో హాజరు కావడం వెనుక ఉద్దేశమేమిటన్న ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి. తెలంగాణ రాజకీయాల్లో పార్టీ ఫిరాయింపుల అంశం ఇప్పటికే న్యాయపరమైన చర్చకు దారితీసింది. బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై తెలంగాణ హైకోర్టు అనర్హత వేటు వేసినట్లు కథనం పేర్కొంటోంది. అనంతరం ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించగా, సెప్టెంబర్ 24న సుప్రీంకోర్టు హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోలేదని సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచిన సంజయ్ కుమార్ కాంగ్రెస్ సభకు ఆ పార్టీ జెండాతో జన సమీకరణలో పాల్గొంటూ కనిపించడం స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. అయితే తాను కాంగ్రెస్‌లో చేరుతున్నారా? లేక బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారా? అనే అంశంపై సంజయ్ కుమార్ అధికారికంగా ఎలాంటి స్పష్టత



ఇస్తారన్నది వేచి చూడాల్సి ఉంది.

## రెండున్నరేళ్లలో విద్యుత్ మౌలిక వసతుల బలోపేతం: ఎస్ఈ



జగిత్యాల, సెప్టెంబర్ 30 (ఈవార్తలు): పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా జగిత్యాల సర్కిల్ పరిధిలో గత రెండున్నరేళ్లుగా విద్యుత్ మౌలిక వసతులను బలోపేతం చేస్తున్నామని టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ బి. సుదర్శనం తెలిపారు. 8 పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచడంతో పాటు 11 అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, 1,160 పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్య పెంపు, 736 అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విద్యుత్ అవసరాలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో రెండు కొత్త 33/11 కేవీ ఉప విద్యుత్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. దీంతో వోల్టేజ్ సమస్యలు తగ్గడంతో పాటు పాత ఉప విద్యుత్ కేంద్రాలపై భారం తగ్గిందని పేర్కొన్నారు. వివిధ ఉప విద్యుత్ కేంద్రాల్లో ఐదు కెపాసిటర్ బ్యాంకులు, 49 వాక్యూమ్ సర్క్యూట్ బ్రేకర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామని సుదర్శనం పేర్కొన్నారు.




## ముందస్తు పరీక్షలతోనే వ్యాధుల నివారణ

మల్యాల, సెప్టెంబర్ 30 (ఈవార్తలు): ముందస్తు వైద్య పరీక్షల ద్వారా వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి, సకాలంలో చికిత్స అందించడం ద్వారా వాటిని నియంత్రించవచ్చని జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ ఎన్. శ్రీనివాస్ అన్నారు. మల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం హెచ్ఐవీ, టీబీతో పాటు వివిధ రకాల రక్త, వైద్య పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రజలు ఎలాంటి అనారోగ్య లక్షణాలు కనిపించినా నిర్లక్ష్యం చేయకుండా ముందస్తుగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రక్త పరీక్షలు, ఎక్స్‌రే, రక్తపోటు, మధుమేహం తదితర పరీక్షలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. శిబిరంలో మొబైల్ ఎక్స్‌రే ద్వారా 86 మందికి పరీక్షలు నిర్వహించారు. హెచ్ఐవీ, టీబీ తదితర వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యురాలు అనూష, మల్యాల సర్పంచ్ బొట్ల జయ, జిల్లా ఆశా నోడల్ అధికారి జ్యోతి, పర్యవేక్షకులు రాజమ్మ, రమణమ్మ, ఐసీటీసీ కౌన్సిలర్ మహేందర్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## విద్యుత్ కోతలను నివారించాలని ఏఈకి బీజేపీ వినతి

మల్యాల, సెప్టెంబర్ 30 (ఈవార్తలు): మండలంలో విద్యుత్ కోతలను నివారించి రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని కోరుతూ బీజేపీ మండల అధ్యక్షుడు గాజుల మల్లేశం ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు బుధవారం విద్యుత్ శాఖ ఏఈ దయానంద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రస్తుతం వరి పంట కీలక దశలో ఉందని, విద్యుత్ కోతల కారణంగా బావులు, బోర్లతో పాటు వాగుల కింద ఉన్న పంట పొలాలకు తగినంత నీరు అందక రైతులు నష్టపోతున్నారని తెలిపారు. వెంటనే కోతలు లేకుండా ఉచితంగా నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బింగి వేణు, బొబ్బిలి వెంకటస్వామి యాదవ్, గొల్లపల్లి సర్పంచ్ గడ్డం మల్లేశం, మాజీ ఎంపీటీసీ రాచర్ల రమేష్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు సామా మైపాల్ రెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు పొన్నగంటి గౌతమ్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు సుంకపాక టైటాస్, నాయకులు నులుగొండ సురేష్, కోన్ శ్రీనివాస్, రాచర్ల రాములు, పులి సంకీర్త్, రాఘవేంద్ర, బండారి రాజు, జిల్లాల రమేష్, కుసుమ సాయికిరణ్, షేర్ల పరశురాం, ఇట్‌రెడ్డి లింగారెడ్డి, సంఘ శంకర్, వెంకటేష్, నేరెళ్ల వర్షిత్ తదితరులు పాల్గొన్నారు.

## బద్దిపోచమ్మ ఆలయం మహా విస్తరణ

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 30 (ఈవార్తలు): దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన బద్దిపోచమ్మ ఆలయంలో అభివృద్ధి, విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. ఆలయ విస్తరణలో భాగంగా ఇప్పటికే ఆలయం వెనుక భాగంలో పలు నిర్మాణ పనులు చేపట్టారు. ప్రస్తుతం ఆలయ విస్తరణలో భాగంగా పాత ప్రహరీ గోడను తొలగించి, దాని స్థానంలో కొత్త ప్రహరీ గోడ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఆలయ పరిసరాలను మరింత అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన వసతులు కల్పించే దిశగా పనులు చేపడుతున్నారు. అభివృద్ధి, విస్తరణ పనులు కొనసాగుతున్నప్పటికీ భక్తులకు అమ్మవారి దర్శనానికి ఎలాంటి అంతరాయం ఉండదని ఆలయ అధికారులు తెలిపారు.



## ముందస్తు అరెస్టులు సిగ్గుచేటు: రెడ్డబోయిన



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 30 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటన సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడం, గృహ నిర్బంధం చేయడంపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతియుతంగా ప్రజా సమస్యలను విన్నవించేందుకు సిద్ధమైన ప్రతిపక్ష నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. తన గృహ నిర్బంధం సందర్భంగా రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చిందని, వాటి అమలుపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ప్రతిపక్షాలకు ఉందన్నారు. ముఖ్యమంత్రిని బహిరంగంగా ప్రశ్నిస్తారనే ఉద్దేశంతోనే పోలీసులు నాయకులను అరెస్టు చేస్తున్నారని ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఇదే తరహాలో వ్యవహరించిందని, ప్రజలు ఆ పార్టీని అధికారానికి దూరం చేశారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే విధంగా వ్యవహరిస్తే ప్రజల విశ్వాసాన్ని కోల్పోతుందని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి దృష్టికి మూడు డిమాండ్లను తీసుకెళ్లారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి మూలవిరాట్ దర్శనాన్ని పునరుద్ధరించడంతో పాటు, పునరుద్ధరణ తేదీని ప్రకటించాలని కోరారు. సిరిసిల్లకు నూలు డిపోను తిరిగి తరలించాలని, కాళేశ్వరం 9వ ప్యాకేజీ పనులను పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం 9వ ప్యాకేజీ పనులు నిలిచిపోవడంతో సాగునీరు అందక రైతులు రెండో పంట సాగు చేయలేక నష్టపోతున్నారని గోపి పేర్కొన్నారు. మూడు సమస్యలపై ముఖ్యమంత్రి స్పష్టమైన ప్రకటన చేయకపోతే బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రజా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై పరిశీలన



మల్యాల, సెప్టెంబర్ 30 (ఈవార్తలు): ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని, ఆయన ప్రజా పరిపాలనలో 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు కటకం లత ఆధ్వర్యంలో తక్కలపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. కేంద్రానికి వస్తున్న చిన్నారులు, గర్భిణులకు అందుతున్న పౌష్టికాహారం, వారి ఆరోగ్య పరిస్థితులపై వివరాలు తెలుసుకున్నారు. బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు, అంగన్‌వాడీ ఉత్సవాల ఇన్‌చార్జి నిర్మలా దేవి ముఖ్య అతిథిగా హాజరై కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం కేంద్రాన్ని నిర్వహిస్తున్న ఆయా, కార్యకర్తలతో మాట్లాడి వివరాలు సేకరించారు. అక్కడికి వచ్చిన చిన్నారుల తల్లిదండ్రులు, గర్భిణులతోనూ మాట్లాడారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. చిన్నారుల భవిష్యత్తు, ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పలు రకాల పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు కేంద్రం ద్వారా అందుతున్న పౌష్టికాహారం సక్రమంగా చేరుతుందా లేదా పరిశీలించారు. పిల్లల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బింగి వేణు, మండల అధ్యక్షుడు గాజుల మల్లేశం, తక్కలపల్లి సర్పంచ్ చీకట్ల లత, ఉప సర్పంచులు కందుల వినోద్, కుక్కర్ మల్లేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి పొన్నం సాయికుమార్, నులుగొండ సురేష్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు సామ మైపాల్ రెడ్డి, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు టైటాస్, పులి సంకీర్త్, భూసార మౌనిక్, బండారి రాజు, రాచర్ల రాములు, నాగరాజ్, చిర్ర రాజ్‌కుమార్, సంకుర్తి వేణు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో పండ్ల పంపిణీ



జగిత్యాల, సెప్టెంబర్ 30 (ఈవార్తలు): బీజేపీ పట్టణ కార్యదర్శి గడ్డల లక్ష్మి ఆధ్వర్యంలో 12వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన 'అంగన్ మిలన్ సేవా' కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ టీచర్ శ్యామల, ఆశా కార్యకర్త అంజలిని సన్మానించారు. అనంతరం చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గడ్డల లక్ష్మి మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు మాతా, శిశు సంక్షేమం కోసం సేవలందిస్తున్న అంగన్‌వాడీ సిబ్బందిని సన్మానించినట్లు తెలిపారు. మహిళా, శిశు సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అమల, గంగు తదితరులు పాల్గొన్నారు.

## ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం: జీవన్ రెడ్డి

జగిత్యాల, సెప్టెంబర్ 30 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా జగిత్యాల జిల్లాలో బీఆర్ఎస్ కార్యకర్తలను ముందస్తుగా అరెస్టు చేయడంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. జీవన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సారంగాపూర్ మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అరెస్టు చేసిన వారిలో రైతులు కూడా ఉన్నారని, వారిని నిర్బంధిస్తే పొలాలకు విద్యుత్ ఎవరు అందిస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం మంచి పనులు చేస్తే ముందస్తు అరెస్టుల అవసరం ఉండదన్నారు. ఎస్సారెస్పీ నుంచి ఖరీఫ్ పంటలకు సాగునీరు అందించాలని, కనీసం విద్యుత్ అయినా సమృద్ధిగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సారెస్పీలో నీటి నిల్వలను పెంచి రబీ పంటలకు సాగునీరు అందించే అవకాశం ఉందన్నారు. సాగునీరు, ఎరువులు, విద్యుత్ సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. బీఆర్ఎస్ కార్యకర్తల ముందస్తు అరెస్టులను ఖండిస్తూ, నిర్బంధించిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## జర్నలిస్టులపై దురుసు ప్రవర్తనపై చర్యలు తీసుకోవాలి

గంగాధర, సెప్టెంబర్ 30 (ఈవార్తలు): కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలోని గంగాధర మండలంలో జర్నలిస్టుల అత్యవసర సమావేశం నిర్వహించారు. కరీంనగర్ జిల్లా జర్నలిస్టుల దాడుల కమిటీ అధ్యక్షుడు శ్రీరామ్ రవీందర్ ఆధ్వర్యంలో, గంగాధర మండల జర్నలిస్టు సంఘం అధ్యక్షుడు జారతి రాజిరెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయుడు చిన్నం రాజమౌళి వార్తా సేకరణకు వెళ్లిన సమయంలో గంగాధర ప్రభుత్వ వైద్యాధికారి సౌమ్య వ్యవహరించిన తీరుపై జర్నలిస్టులు అభ్యంతరం వ్యక్తం చేశారు. వార్తా సేకరణకు వెళ్లిన పాత్రికేయుడితో బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న అధికారి దురుసుగా ప్రవర్తించడం సరికాదని పేర్కొన్నారు. జర్నలిస్టుల పట్ల అనుచితంగా వ్యవహరించిన అధికారిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని సమావేశంలో డిమాండ్ చేశారు.

## జాతీయ స్థాయి యోగా పోటీలకు గురుకుల విద్యార్థిని



మల్యాల, సెప్టెంబర్ 30 (ఈవార్తలు): కరీంనగర్‌లోని ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో ఇటీవల తెలంగాణ యోగా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో తాటిపల్లి గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న టి. కమలిని ప్రతిభ కనబరిచింది. 14 నుంచి 16 ఏళ్ల వయసు విభాగంలో తృతీయ స్థానం సాధించి జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపికైంది. అక్టోబర్ 3 నుంచి 6వ తేదీ వరకు రాజస్థాన్‌లోని జైపూర్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి యోగా పోటీల్లో కమలిని పాల్గొననున్నట్లు జగిత్యాల జిల్లా యోగా సంఘం కార్యదర్శి మనోజ్ తెలిపారు. ఎంపికైన విద్యార్థినిని పాఠశాల ప్రిన్సిపాల్ మానస, ఉపాధ్యాయులు, యోగా సంఘం సభ్యులు అభినందించారు. విద్యార్థిని ఎంపికకు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం శిక్షణ ఇచ్చి కృషి చేసిన శారీరక విద్యా ఉపాధ్యాయురాలు మధులికను వారు అభినందించారు.




## జగిత్యాల అదనపు కలెక్టర్ లత పదవీ విరమణ

జగిత్యాల, సెప్టెంబర్ 30 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత పదవీ విరమణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అదనపు కలెక్టర్‌గా బి.ఎస్. లత క్రమశిక్షణ, సమయస్ఫూర్తి, పారదర్శకతతో విధులు నిర్వహించారని ప్రశంసించారు. వరి ధాన్యం కొనుగోళ్లలో జగిత్యాల జిల్లాను అగ్రగామిగా నిలపడంలో ఆమె కీలక పాత్ర పోషించారని తెలిపారు. సుదీర్ఘ ఉద్యోగ జీవితంలో సంపాదించిన అనుభవంతో జిల్లా ప్రగతికి ఆమె అందించిన సేవలు అభినందనీయమన్నారు.



## ప్రజా గొంతుకను అణచివేయడం సరికాదు: దావ వసంత

జగిత్యాల, సెప్టెంబర్ 30 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిరిసిల్ల పర్యటన సందర్భంగా జగిత్యాల జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్‌ను పోలీసులు గృహ నిర్బంధం చేయడాన్ని ఆమె ఖండించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం కృషి చేసే హక్కు ప్రతి పౌరుడికీ ఉందన్నారు. సీఎం పర్యటన పేరుతో తనను ఇంటి నుంచి బయటకు వెళ్లకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని పేర్కొన్నారు. పోలీసులు ప్రజలకు రక్షణ కల్పించాలే తప్ప రాజకీయ నాయకుల మాదిరిగా వ్యవహరించకూడదన్నారు. ప్రజా సమస్యలపై మాట్లాడుతున్న వారిని నిర్బంధించడం ద్వారా సమస్యలు పరిష్కారం కావని అన్నారు. నేతన్నలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆరోపించారు. కేటీఆర్ హయాంలో సిరిసిల్లలో జరిగిన అభివృద్ధిని పరిశీలించి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన నియోజకవర్గమైన కొడంగల్‌ను కూడా అభివృద్ధి చేసి చూపించాలని సూచించారు. ఎన్ని నిర్బంధాలు, ఆంక్షలు విధించినా ప్రజా సమస్యలపై తన పోరాటాన్ని కొనసాగిస్తానని దావ వసంత సురేష్ స్పష్టం చేశారు.

## సీజనల్ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

జగిత్యాల, సెప్టెంబర్ 30 (ఈవార్తలు): సీజనల్ జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను నెల రోజుల్లోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం జగిత్యాల ఏరియా ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీ నిర్వహించి వైద్య సేవలు, పారిశుధ్యం, మౌలిక వసతులను పరిశీలించారు. ఆసుపత్రిలో పార్కింగ్, పైకప్పు లీకేజీలు, ధోబీ గది, వంటశాల తదితర సమస్యలను అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. పార్కింగ్ సమస్య పరిష్కారానికి ఎస్పీ, మున్సిపల్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. ఆరోగ్యశ్రీ నమోదుల సంఖ్యను పెంచేలా ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఆసుపత్రి పైకప్పుపై పేరుకుపోయిన వ్యర్థాలను రెండు వారాల్లోగా తొలగించి పరిశుభ్రతను మెరుగుపరచాలని సూచించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న వైద్య కళాశాలను పరిశీలించి మిగిలిన పనులను నెల రోజుల్లో పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, ఆసుపత్రి సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్, తహసీల్దార్ రామ్మోహన్, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.





## జూ.ఎన్టీఆర్.. సీఎం సీఎం

ఫహద్ ఫాజిల్ హీరోగా నటించిన 'డోంట్ ట్రబుల్ ద ట్రబుల్' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో జూనియర్ ఎన్టీఆర్ మెరిసారు. ఈ సందర్భంగా ఆయన ఇచ్చిన పదహారు నిముషాల స్పీచ్ అయితే అక్కడ ఉన్న వారినే కాదు సోషల్ మీడియా ద్వారా చూస్తున్న వారికి కూడా ఎంతగానో ఆకట్టుకుంటోంది. జూనియర్ స్పీచ్ లో ఎక్కడా తడబడకుండా తాను చెప్పాల్సిన విషయం చెబుతూ తన అభిమానుల గురించి తన ఎమోషన్స్ గురించి కూడా విప్పి చెప్పారు. జూనియర్ ఎన్టీఆర్ ప్రసంగిస్తున్నంతసేపూ ఆద్యంతం ఆయన అభిమానులు అయితే ఒక్కటే స్లోగన్ చేస్తూ వచ్చారు. సీఎం అంటూ సభలో సందడి చేశారు. ఈ నినాదాలు ఒక వైపు వినిపిస్తున్నప్పటికీ జూనియర్ ఎక్కడా తొణకలేదు, తొట్రుపాటుకు గురి కాలేదు, ఆయన తాను ఏమని చెప్పదలచుకున్నారో ఆ సబ్జెక్ట్ మీద ఎక్కడా డీవీయేట్ కాకుండా తన స్పీచ్ ని కొనసాగించి తన స్థిత ప్రజ్ఞతను చాటుకున్నారు. ఒక విధంగా చూస్తే దటీజ్ ఎన్టీఆర్ అనిపించారు. ఆయనలో మెచ్యూరిటీ లెవెల్స్ ఎంత హైలో ఉన్నాయో కూడా ఈ ఉదంతం మరోసారి నిరూపించినట్లు అయింది.

## మాజీ ప్రేయసి, భార్య ఒకే వేదికపై!



ప్రముఖ నటి కరీనా కపూర్ ఖాన్ తన పాపులర్ చాట్ షో అయిన వాట్ ఉ మెన్ వాంట్ కొత్త సీజన్ కోసం తన మాజీ ప్రియుడి భార్యను గెస్ట్‌గా ఆహ్వానించడం ప్రస్తుతం సర్వత్రా చర్చనీయాంశమైంది. బాలీవుడ్ స్టార్ హీరో షాహిద్ కపూర్ సతీమణి మీరా రాజ్‌పుత్, కరీనా కపూర్ నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక టాక్ షోలో పాల్గొనేందుకు వచ్చారు. ఒకప్పుడు షాహిద్ కపూర్‌తో ప్రేమాయణం సాగించి ఆ తర్వాత విడిపోయిన కరీనా కపూర్, ఇప్పుడు ఏకంగా ఆయన భార్య మీరాతో కలిసి ఒకే వేదికపై కనిపించడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈ అనూహ్య కలయికకు సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యాయి. షూటింగ్ సమయంలో వీరిద్దరూ చాలా ఉత్సాహంగా గడిపినట్లు తెలుస్తోంది. ఈ షోకి సంబంధించిన అనుభవాలను షేర్ చేస్తూ కరీనా కపూర్ తన సోషల్ మీడియా వేదికగా మీరా రాజ్‌పుత్‌ను ఎంతగానో ప్రశంసించారు. మీరా చాలా మంచి మనస్తత్వం ఉన్న మనిషి అని.. తనతో గడపడం చాలా సంతోషంగా ఉందని కీర్తిస్తూ వార్మ్ అండ్ లవ్లీ అంటూ కొనియాడారు. కరీనా ప్రశంసలపై మీరా రాజ్‌పుత్ కూడా సానుకూలంగా స్పందించారు. ఈ షోలో పాల్గొనడంపై సంతోషం వ్యక్తం చేస్తూ.. కరీనా కపూర్ లాంటి గొప్ప మహిళతో కలిసి వేదికను షేర్ చేసుకోవడం అద్భుతమైన అనుభూతి అని పేర్కొన్నారు. వీరిద్దరు పరస్పరం సహకరించుకోవడం బాలీవుడ్ సెలబ్రిటీల మధ్య కొత్త సంస్కృతికి తెరతీసింది.

## కల్కి 2.. సుమతి చుట్టూ మిస్టరీ

'కల్కి 2898 ఏడీ' సీక్వెల్ పై అంచనాలు ఏ స్థాయిలో ఉన్నాయో చెప్పాల్సిన పనిలేదు. ఫస్ట్ పార్ట్ సాధించిన విజయం తర్వాత రెండవ భాగం కల్కి 2 అసాధారణ అంచనాలున్నాయి. ముఖ్యంగా ఈ కథ మొత్తానికి జీవనాడి లాంటి సుమతి పాత్ర చుట్టూ అంతుచిక్కని మిస్టరీ కనిపిస్తుంది. తొలి భాగంలో సుమతి పాత్రలో బాలీవుడ్ స్టార్ నటి దీపికా పదుకొణే అద్భుతంగా నటించిన సంగతి తెలిసిందే. సుమతి గర్భంలో పెరుగుతున్న పిండమే కల్కి అవతారమని చూపించడంతో కథ మొత్తం ఆ పాత్ర రక్షణ చుట్టూనే తిరిగింది. అయితే పార్ట్ 2 నిర్మాణ సమయానికి దీపికా పదుకొణే ప్రాజెక్ట్ నుంచి ఎగ్జిట్ అయ్యారు. దీంతో దీపిక స్థానంలో మరొక నటిని తీసుకొస్తారా? లేదా? అన్న దానిపై రకరకాల పేర్లు తెరపైకి వస్తున్నాయి. ఈ క్రమంలో దర్శకుడు నాగశ్విన్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు ఈ సస్పెన్స్‌ను మరింత పెంచాయి. కల్కి 2లో కొత్తగా ఎలాంటి కొత్త పాత్రలు రావడం లేదని పార్ట్ 1లోని పాత్రలే సీక్వెల్‌లో కొనసాగుతాయని పేర్కొన్నారు. దీంతో అసలు సుమతి పాత్ర కథనం సీక్వెల్‌లో ఎలా? ఉండబోతోందనేది పెద్ద పజిల్‌లా మారింది.

# ముంబైకి కల్యాణి ప్రియదర్శన్ మకాం

మలయాళ, తెలుగు, తమిళ చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన కల్యాణీ ప్రియదర్శన్ హిందీ చిత్రసీమలో అరంగేట్రం చేస్తున్న సంగతి తెలిసిందే. బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న భారీ ప్రాజెక్ట్ ప్రళయ్ తో అమ్మడు నార్త్ ఆడియన్స్ ను పలకరించనున్నారు. ఇప్పటికే అమ్మడు షూటింగ్ లో జాయిన్ అయింది. షూటింగ్ కోసం అమ్మడు చెన్నై టూ ముంబై తిరుగుతోంది. ఈ నేపథ్యంలో ప్రయాణాలు చేయలేక కల్యాణీ పూర్తిగా ముంబైకి మకాం మారుస్తున్నట్లు తెలిసింది. జై మెహతా దర్శకత్వంలో తెరకెక్కుతోన్న జాంబీ థ్రిల్లర్ చిత్రంలో కల్యాణి ప్రియదర్శన్ కథానాయికగా నటిస్తున్నారు. ఈ సినిమా కోసం సాధారణ దినచర్యను పూర్తిగా మార్చుకున్నట్లు తెలుస్తోంది. ముంబైలో ప్రత్యేకంగా నివాసం ఏర్పాటు చేసుకుని సినిమాకు సంబంధించిన సన్నాహాలలో పూర్తిగా నిమగ్నమయ్యారు. ఈ ప్రాజెక్ట్ తన కెరీర్‌లో అత్యంత ప్రత్యేకమైనదిగా నిలుస్తుందని భావిస్తున్నారు. ఈ చిత్రంలో పాత్ర కోసం కల్యాణి యాక్షన్ కు సంబంధించి శిక్షణ తీసుకుంటున్నట్లు సమాచారం. జాంబీ థ్రిల్లర్ జానర్ కావడంతో సినిమాలో ఊహించని యాక్షన్ సన్నివేశాలు, ఛేజింగ్‌లు ఉన్నాయట. ఇందుకోసం ఆమె ప్రొఫెషనల్ స్టంట్ మాస్టర్ల ఆధ్వర్యంలో కఠినమైన వర్కవుట్లు, మార్షల్ ఆర్ట్స్ , హ్యాండ్-టూ-హ్యాండ్ కంబాట్ ట్రైనింగ్ తీసుకుంటూ ఫిట్‌నెస్‌ను నెక్స్ట్ లెవెల్‌కు మార్చుకుంటున్నారు.





## అబ్బాయిలను పెంచే పద్ధతి మారాలి

సమాజంలో బాలికలు, మహిళల రక్షణ కోసం ప్రాథమిక స్థాయిలోనే మార్పు రావలసిన అవసరం ఉందని తల్లిదండ్రులు మగపిల్లలను ఎవరికీ హాని తలపెట్టని విధంగా పెంచాలని నటి, సామాజిక కార్యకర్త దియా మీర్జా పిలుపునిచ్చారు. అబ్బాయిలకు చిన్నతనం నుంచే సమ్మతి, పరస్పర గౌరవం, ఆమోదం ప్రాముఖ్యతను నేర్పించడం ద్వారా మాత్రమే మహిళలకు సురక్షితమైన సమాజాన్ని నిర్మించగలమని స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన ఫిక్కి ఫ్రేమ్స్ సదస్సులో పాల్గొన్న దియా మీర్జా లింగ సమానత్వం , పిల్లల పెంపకంపై ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పిల్లలను పెంచే విధానంలో తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకమని దియా మీర్జా అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ఇంట్లో మగపిల్లలకు ఇతర వ్యక్తుల సరిహద్దులను గౌరవించడం, నో అనే సమాధానాన్ని అంగీకరించడం నేర్పించాలని సూచించారు. మేము మా మగపిల్లలను ఎవరికీ భౌతికంగా , మానసికంగా హాని కలిగించని విధంగా పెంచినప్పుడు మాత్రమే ఆడపిల్లలకు సమాజంలో పూర్తి రక్షణ లభిస్తుందన్నారు.

## నోరా ఫతేహి.. బిందాస్ ఊపు!



సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ సీక్వెల్ చిత్రం జైలర్ 2 నుండి తాజాగా బిందాస్ సాంగ్ విడుదలైంది. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై వస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ గ్లామరస్ బ్యూటీ నోరా ఫతేహి ప్రత్యేక నృత్యంతో అలరించారు. అప్పుడు జైలర్ చిత్రంలో కావాలా... అంటూ తమన్నా నడుము ఊపునకు ఎలాంటి క్రేజ్ వచ్చిందో... ఇప్పుడు అదే స్థాయిలో నోరా ఫతేహి డాన్స్ కూడా సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. అయితే ఈ పాటకు సంబంధించి సంగీత ప్రియుల నుంచి మిశ్రమ స్పందనలు వ్యక్తమవుతున్నాయి. నోరా ఫతేహి తన క్లాసిక్ - చిల్లింగ్ స్టెప్పులతో స్టేజ్‌ను షేక్ చేసినా.. మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ అందించిన బాణీ మాత్రం కొంత నిరాశపరిచాయనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

## పారిస్ ర్యాంప్‌పై ఐశ్వర్య రాయల్ వైబ్



గ్లోబల్ బ్యూటీ ఐశ్వర్య రాయ్ బచ్చన్ మరోసారి తన రాయల్ లుక్స్‌తో అంతర్జాతీయ వేదికపై మ్యాజిక్ చేసారు. పారిస్ ఫ్యాషన్ వీక్ 2026లో భాగంగా సెప్టెంబర్ 28న ఈఫిల్ టవర్ బ్యాక్‌డ్రాప్‌లో జరిగిన లొరియల్ పారిస్ తొమ్మిదవ ఎడిషన్ 'లే డెఫిలే' షోలో ఆమె అద్భుతమైన వాక్‌తో అందరినీ అవాకాయిపోయేలా చేశారు. "వాక్ యువర్ వర్త్" థీమ్‌తో జరిగిన ఈ వేడుకలో ఐశ్వర్య తన అమేజింగ్ ప్రెజెన్స్‌తో మరోసారి గ్లోబల్ ఐకాన్‌గా నిలిచారు. యారా షూమేకర్ బ్లాక్ వెల్వెట్ డ్రెస్: ఈసారి పారిస్ ర్యాంప్‌పై ఐశ్వర్య రాయ్ వెరైటీ లుక్‌తో మెరిశారు. ప్రముఖ డిజైనర్ యారా షూమేకర్ రూపొందించిన టూ-పీస్ బ్లాక్ వెల్వెట్ సిల్హౌట్ ఎన్సెంబుల్‌లో ఆమె ఒక క్వీన్‌లా దర్శనమిచ్చారు.

## బోల్డ్‌గా అమలాపాల్!



దక్షిణాది చిత్ర పరిశ్రమలో విభిన్నమైన పాత్రలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రతిభావంతురాలు అమలా పాల్. అమ్మడు కెరీర్ ప్రారంభం నుంచి గ్లామర్ పాత్రలతో పాటు నటనకు ప్రాధాన్యత ఉన్న సినిమాలలో నటిస్తూ ప్రశంసలు అందుకున్నారు. అయితే అమల కెరీర్‌లో బోల్డ్ అండ్ సంచలన చిత్రంగా నిలిచిన ఆడై సినిమా గురించి మరోసారి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఈ చిత్రంలో ఓ కీలక సన్నివేశం కోసం నగ్నంగా నటించాల్సి వచ్చినప్పుడు ఎంతగా భయపడిందో రివీల్ చేసారు. రత్నకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఆడై చిత్రంలో అమలా పాల్ కామిని అనే బోల్డ్ రెబల్ పాత్రలో నటించారు. ట్రైలర్ విడుదలైనప్పట్నుంచే ఇండస్ట్రీలో పెద్దఎత్తున చర్చనీయాంశమైంది. ముఖ్యంగా కీలక సన్నివేశాలలో ఆమె వస్త్రాలు లేకుండా కెమెరా ముందుకు రావాల్సి రావడం అప్పట్లో ఓ సంచలనం. ఈ సీన్ షూటింగ్ సమయంలో పడిన మానసిక సంఘర్షణ గురించి కెమెరా ముందుకు వచ్చే ధైర్యం ఎలా తెచ్చుకుందనే దాని గురించి వివరించారు. నిజ జీవితంలో నటిగా, మహిళగా అలాంటి సాహసోపేతమైన నిర్ణయం తీసుకోవడం అంత సులభం కాదని అమలా పాల్ పేర్కొన్నారు.








# 400 ఊదేశారు

## శుభ్‌మన్ గిల్ డబుల్ సెంచరీ.. కోహ్లీ అవుటైనా.. రో'హిట్' షో

### అండగా రుతురాజ్ గైక్వాడ్.. వెస్టిండీస్ 405 పరుగులు జుజుబీ.. క్యాంప్‌బెల్ రికార్డు శతకం వృథా

**వెస్టిండీస్ 405 పరుగులు చేసింది.. భారత్ ముందు 406 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచింది. కానీ టీమిండియా బ్యాటర్లు ఆ లక్ష్యాన్ని చూసి బెదరలేదు. బంతి బంతికీ ఆధిపత్యం చూపించారు. ఒకవైపు రోహిత్ శర్మ సెంచరీతో పునాది వేస్తే.. మరోవైపు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ డబుల్ సెంచరీతో విధ్వంసం సృష్టించాడు. కోహ్లీ 29 పరుగులకే వెనుదిరిగినా.. రుతురాజ్ గైక్వాడ్ అండగా నిలవడంతో గిల్ చివరి వరకు నాటౌట్‌గా నిలిచి భారత్‌కు చారిత్రాత్మక విజయాన్ని అందించాడు.**

**43.3 ఓవర్లలో 406/2తో లక్ష్యాన్ని ఛేదించిన టీమిండియా 8 వికెట్ల తేడాతో గెలిచింది. దీంతో మరో మ్యాచ్ మిగిలి ఉ ండగానే మూడు వన్డేల సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకుంది. టాస్ గెలిచి తొలుత బౌలింగ్ ఎంచుకున్న భారత్‌కు వెస్టిండీస్ బ్యాటర్లు గట్టి సవాల్ విసిరారు. జాన్ క్యాంప్‌బెల్, షై హోప్, అమీర్ జాంగూ సెంచరీలతో చెలరేగడంతో విండీస్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 405 పరుగులు చేసింది. ఇది వన్డేల్లో వెస్టిండీస్‌కు అత్యధిక స్కోర్. భారత్‌పై కూడా వారి అత్యధిక వన్డే స్కోర్ ఇదే.**

406 పరుగుల లక్ష్యం భారత్‌కు ఏమాత్రం భారంగా అనిపించలేదు. రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ మొదటి నుంచే విండీస్ బౌలర్లపై ఎదురుదాడి చేశారు. ఓపెనింగ్ జోడీ ఏకంగా 255 పరుగులు జోడించి భారీ ఛేదనకు బలమైన పునాది వేసింది. రోహిత్ శర్మ 75 బంతుల్లో 101 పరుగులు చేశాడు. 10 ఫోర్లు, 6 సిక్సర్లతో అదరగొట్టిన రోహిత్.. వన్డేల్లో తన 35వ సెంచరీని నమోదు చేశాడు. ఈ ఇన్నింగ్స్‌లోనే 12 వేల వన్డే పరుగుల మైలురాయిని కూడా అందుకున్నాడు. ఈ ఘనత సాధించిన మూడో భారత బ్యాటర్‌గా సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీ సరసన నిలిచాడు. రోహిత్ ఔటైన తర్వాత గిల్ తన జోరును మరింత పెంచాడు. 133 బంతుల్లో 223 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. అతడి ఇన్నింగ్స్‌లో 26 ఫోర్లు, 8 సిక్సర్లు ఉన్నాయి. 117 బంతుల్లోనే డబుల్ సెంచరీ పూర్తి చేసిన గిల్.. వన్డే చరిత్రలో అత్యంత వేగంగా 200 పరుగులు చేసిన బ్యాటర్‌గా రికార్డు సృష్టించాడు. గిల్ డబుల్ సెంచరీతో మరో అరుదైన ఘనత సాధించాడు. వన్డేల్లో రెండుసార్లు 200 పరుగులు చేసిన రెండో బ్యాటర్‌గా నిలిచాడు. అంతకుముందు ఈ ఘనత రోహిత్ శర్మకు మాత్రమే ఉంది. గిల్ 2023లో న్యూజిలాండ్‌పై తొలిసారి డబుల్ సెంచరీ చేశాడు. ఇప్పుడు గువాహటిలో మరోసారి 200 దాటాడు. అంతేకాదు.. గిల్ 223 పరుగులు వన్డేల్లో ఒక కెప్టెన్ చేసిన అత్యధిక వ్యక్తిగత స్కోర్‌గా కూడా నమోదైంది. 62 బంతుల్లో సెంచరీ చేసిన అతడు భారత కెప్టెన్‌గా వేగవంతమైన వన్డే సెంచరీ రికార్డును కూడా అందుకున్నాడు. రోహిత్ ఔటైన తర్వాత విరాట్ కోహ్లీ క్రీజులోకి వచ్చాడు. అయితే తొలి వన్డేలో సెంచరీతో అదరగొట్టిన కోహ్లీ ఈసారి 29 పరుగులకే వెనుదిరిగాడు. దీంతో భారత్‌కు చిన్న ఎదురుదెబ్బ తగిలినప్పటికీ గిల్‌పై దాని ప్రభావం పడలేదు. కోహ్లీ తర్వాత వచ్చిన రుతురాజ్ గైక్వాడ్ బాధ్యతగా ఆడాడు. గిల్‌తో కలిసి మ్యాచ్‌ను ముగించాడు. గైక్వాడ్ 37 బంతుల్లో 31 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. మరోవైపు గిల్ చివరి వరకు అజేయంగా నిలిచి 223 పరుగులతో భారత చరిత్రాత్మక విజయానికి హీరోగా మారాడు. 406 పరుగుల లక్ష్యాన్ని 43.3 ఓవర్లలోనే ఛేదించిన భారత్.. వన్డేల్లో తన అత్యధిక విజయవంతమైన ఛేదనను నమోదు చేసింది. ఇంతకుముందు భారత్ అత్యధికంగా 362 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది. ఇప్పుడు 406 పరుగులతో ఆ రికార్డును భారీగా మెరుగుపర్చింది. 400కుపైగా లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించిన ప్రపంచంలో రెండో జట్టుగా కూడా భారత్ నిలిచింది. ఇక విండీస్ ఇన్నింగ్స్‌లోనూ రికార్డులే. ఒకే ఇన్నింగ్స్‌లో జాన్ క్యాంప్‌బెల్, షై హోప్, అమీర్ జాంగూ సెంచరీలు చేశారు. విండీస్ వన్డే చరిత్రలో ఒకే ఇన్నింగ్స్‌లో ముగ్గురు బ్యాటర్లు సెంచరీలు చేయడం ఇదే తొలిసారి.

### రోహిత్ రికార్డుల జోరు

రోహిత్‌కు ఈ మ్యాచ్ మరో రెండు మైలురాళ్లను అందించింది. 12 వేల వన్డే పరుగుల క్లబ్‌లోకి చేరిన అతడు ఈ మార్క్‌ను 282 ఇన్నింగ్స్‌ల్లో అందుకున్నాడు. విరాట్ కోహ్లీ 242 ఇన్నింగ్స్‌ల్లో ఈ ఘనత సాధించగా.. రోహిత్ రెండో వేగవంతమైన భారత బ్యాటర్‌గా నిలిచాడు. భారత గడ్డపై వన్డేల్లో 200 సిక్సర్లు పూర్తి చేసిన తొలి బ్యాటర్‌గా కూడా రోహిత్ నిలిచాడు. దీంతో గువాహటి మ్యాచ్ అతడి రికార్డుల జాబితాలో మరో ప్రత్యేక అధ్యాయంగా మారింది.



# పసిడికి గురి పెట్టి కొట్టారు!

**ఆసియా క్రీడలు 2026లో భారత అథ్లెట్లు అద్భుత ప్రదర్శనను కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా ఆర్చరీలో నేడు భారత్‌కు స్వర్ణాల పంట పండింది. మహిళల కాంపౌండ్ ఆర్చరీ జట్టు ఫైనల్‌లో చైనాను చిత్తు చేసి టైటిల్‌ను నిలబెట్టుకుంది. ఈ క్రమంలో దక్షిణ కొరియా పేరిట ఉన్న ప్రపంచ రికార్డును కూడా సమం చేసింది.**

అదే జోరులో కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ కూడా స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. సాహిబ్ జాదవ్, చికితా తానివర్తి జోడీ స్వర్ణం గెలిచింది. ఈ విజయంతో లాస్ ఏంజిల్స్ 2028 ఒలింపిక్స్‌కు అర్హత కూడా సాధించి భారత్‌కు రెట్టింపు ఆనందాన్ని అందించింది. ఇతర క్రీడల్లోనూ భారత క్రీడాకారులు సత్తా చాటారు. మహిళల స్క్వాష్‌లో తన్వి ఖన్నా, అనహత్ సింగ్‌లతో కూడిన జట్టు సెమీఫైనల్‌కు దూసుకెళ్లి మరో పతకాన్ని ఖాయం చేసింది. అథ్లెటిక్స్ ఈవెంట్లు ముగియడంతో ఇప్పుడు అందరి దృష్టి రెజ్లర్లు, బాక్సర్లు, ఆర్చర్లపైనే ఉంది. హాకీలో భారత మహిళల జట్టు ఫైనల్‌లో స్థానం కోసం దక్షిణ కొరియాతో తలపడనుంది. స్టార్ జూడోకా అస్మితా దేయ్ కూడా బరిలోకి దిగనుంది. నిన్న మహిళల ట్రాప్‌లో వ్యక్తిగత స్వర్ణం గెలిచిన నీరూ ధండా, నేడు మిక్స్‌డ్ టీమ్ క్వాలిఫికేషన్, టీమ్ ఈవెంట్‌లో పోటీపడనుంది.

# చీఫ్ సెలెక్టర్‌గా ప్రజ్ఞాన్ ఓజా?



టీమిండియా మాజీ స్పిన్నర్ ప్రజ్ఞాన్ ఓజా భారత క్రికెట్ జట్టు తదుపరి చీఫ్ సెలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. అజిత్ అగార్కర్ ఈ పదవి నుంచి వైదొలగడంతో, ప్రస్తుతం సెలెక్షన్ కమిటీకి తాత్కాలిక హెడ్‌గా ఉన్న 39 ఏళ్ల ఓజానే పూర్తిస్థాయి చీఫ్ సెలెక్టర్‌గా నియమించనున్నట్లు తెలుస్తోంది. మంగళవారం గువాహటిలో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌తో నలుగురు సెలెక్టర్ల కమిటీ సుదీర్ఘంగా సమావేశమైంది. వెస్టిండీస్‌తో రెండో వన్డేకు ఒకరోజు ముందు బర్సపరా స్టేడియంలో ఈ భేటీ జరిగింది. ఈ సమావేశంలో ప్రజ్ఞాన్ ఓజాతో పాటు శివ సుందర్ దాస్, అజయ్ రాత్రా, ఆర్‌పీ సింగ్ పాల్గొన్నారు. అయితే, మాజీ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ ఇందులో పాలుపంచుకోలేదు. సాధారణంగా ఒక ద్వైపాక్షిక సిరీస్ సమయంలో సెలెక్షన్ కమిటీ మొత్తం ఇలా సమావేశం కావడం అరుదు కావడంతో, ఓజా నియామకం దాదాపు ఖరారైనట్లేనని తెలుస్తోంది. త్వరలో ప్రారంభం కానున్న న్యూజిలాండ్ పర్యటనకు భారత జట్లను ఎంపిక చేసే విషయంపైనే ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించినట్లు సమాచారం. అక్టోబర్ 22 నుంచి నవంబర్ 27 వరకు జరగనున్న ఈ సుదీర్ఘ పర్యటనలో భారత్ ఐదు టీ20లు, ఐదు వన్డేలు, రెండు టెస్టులు ఆడనుంది. దీంతో పాటు, అక్టోబర్ 24 నుంచి న్యూజిలాండ్‌లో మూడు టెస్టులు ఆడనున్న భారత్ 'ఎ' జట్టును కూడా ఎంపిక చేయాల్సి ఉంది.

# మిడిలార్డర్‌లో ప్రత్యేక సవాళ్లు: గైక్వాడ్



అంతర్జాతీయ క్రికెట్‌లో సుదీర్ఘ విరామం తర్వాత బరిలోకి దిగడం కొంత ఒత్తిడికి గురిచేస్తుందని టీమిండియా బ్యాటర్ రుతురాజ్ గైక్వాడ్ తెలిపాడు. ఓపెనర్‌గా ఆడటానికి, మిడిలార్డర్‌లో బ్యాటింగ్ చేయడానికి చాలా తేడా ఉంటుందని చెప్పాడు. ముఖ్యంగా అంతర్జాతీయ స్థాయిలో నాలుగో స్థానంలో ఆడేటప్పుడు పరిస్థితులకు అనుగుణంగా వ్యూహాలను మార్చుకోవాల్సి ఉంటుందని వివరించాడు. రెండో వన్డేకు ముందు ప్రసారకర్తలతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశాడు. తాను ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 100కు పైగా ఇన్నింగ్స్‌లు ఓపెనర్‌గా ఆడినట్లు గైక్వాడ్ తెలిపాడు. మిడిలార్డర్‌లో బ్యాటింగ్ చేసేటప్పుడు సింగిల్స్ తీస్తూ స్ట్రైక్ రొటేట్ చేయడం కీలకమని పేర్కొన్నాడు. పవర్‌ప్లేలో ఫీల్డర్లు లోపల ఉండటంతో బౌండరీలు సాధించడం సులభమవుతుందని, మిడిలార్డర్‌లో మాత్రం పరిస్థితులను బట్టి సరైన షాట్లు ఎంచుకోవాల్సి ఉంటుందని చెప్పాడు. తన బలాలపై నమ్మకంతో ఆడటమే ముఖ్యమని అభిప్రాయపడ్డాడు. దక్షిణాఫ్రికాపై 2025 డిసెంబరులో సెంచరీ చేసిన తర్వాత పలు మ్యాచ్‌లు ఆడినట్లు గైక్వాడ్ తెలిపాడు. ఐపీఎల్‌తో పాటు భిన్నమైన పరిస్థితుల్లో, వేర్వేరు స్థానాల్లో బ్యాటింగ్ చేసినట్లు చెప్పాడు. చాలా కాలం తర్వాత భారత జట్టులోకి తిరిగి వచ్చినప్పుడు సహజంగానే కొంత ఆందోళన ఉంటుందని పేర్కొన్నాడు. తిరువనంతపురంలో జరిగిన గత మ్యాచ్‌లో ఎనిమిది వికెట్ల తేడాతో భారత్ విజయం సాధించగా.. గైక్వాడ్ 13 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఆ మ్యాచ్‌లో క్రీజులో కొంతసేపు గడపడం తనకు ఉపయోగపడిందని తెలిపాడు.

నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# చాప కింద నీరులా డ్రగ్స్ భూతం

మాదకద్రవ్యాల భూతం మళ్లీ తన కోరలు చాస్తోంది. ఒకప్పుడు కొన్ని ప్రాంతాలకు, కొన్ని వర్గాలకు పరిమితమైన మాదకద్రవ్యాల వినియోగం ఇప్పుడు చాప కింద నీరులా విస్తరిస్తోంది. నగరాలు, పట్టణాలు దాటి విద్యార్థులు, యువత వరకు చేరుతోంది. సంపన్నులు, సామాన్యులు అనే తేడా లేకుండా కుటుంబాలను, భవిష్యత్తులను దెబ్బతీస్తోంది. బయటకు కనిపించేది కొంతే.. కనిపించని నెట్‌వర్క్ మాత్రం మరెంత విస్తరించిందో అంచనా వేయడం కష్టంగా మారుతోంది. డ్రగ్స్ అంటే కేవలం ఒక నేరం కాదు. అది ఒక కుటుంబాన్ని కూల్చగలదు. ఒక యువకుడి భవిష్యత్తును చీకట్లోకి నెట్టగలదు. ఒక తరం ఆలోచనా విధానాన్ని దెబ్బతీయగలదు. అందుకే మాదకద్రవ్యాల నియంత్రణను కేవలం పోలీసుల బాధ్యతగా చూడటం ప్రమాదకరం. ఇది ప్రభుత్వాల సమన్వయంతో పాటు సమాజం మొత్తం భాగస్వామ్యం కావాల్సిన అంశం. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తోంది. ఎక్కడైనా డ్రగ్స్ పట్టుబడితే పోలీసులు కేసులు నమోదు చేయడం, కొందరు నిందితులను అరెస్టు చేయడం, కొంతకాలం విస్తృతంగా ప్రచారం జరగడం సాధారణమైపోయింది. కానీ అసలు ప్రశ్న అక్కడితో ముగియదు. డ్రగ్స్ ఎక్కడి నుంచి వస్తున్నాయి? వాటిని ఎవరు సరఫరా చేస్తున్నారు? డబ్బు ఎక్కడి నుంచి వస్తోంది? యువతకు వాటిని చేరవేస్తున్న మధ్యవర్తులు ఎవరు? ఒకరిని అరెస్టు చేస్తే వెనుక ఉన్న మొత్తం వ్యవస్థ బయటపడుతోందా? ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతకాల్సిన అవసరం ఉంది. ఇక్కడే ప్రభుత్వాల చర్యలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. డ్రగ్స్ కేసుల్లో అప్పుడప్పుడు పెద్ద ఎత్తున పట్టుబడిన సరుకును చూపించడం, అరెస్టుల వివరాలు వెల్లడించడం మాత్రమే సరిపోదు. అంతర్జాతీయ, అంతర్రాష్ట్ర, స్థానిక స్థాయిలో పనిచేసే సరఫరా గొలుసును గుర్తించి ధ్వంసం చేయాలి. అక్రమ రవాణా వెనుక ఉన్న ఆర్థిక లావాదేవీలను అనుసరించాలి. నల్లధనం ఎక్కడి నుంచి వస్తోందో, ఎక్కడికి వెళ్తుందో గుర్తించాలి. అప్పుడే అసలు నెట్‌వర్క్‌పై దెబ్బ పడుతుంది. మరో ఆందోళనకర అంశం యువత. మాదకద్రవ్యాల బారిన పడుతున్న వారిలో చిన్న వయసువారు కూడా ఉంటున్నారనే ఆందోళనలు పెరుగుతున్నాయి. స్నేహాలు, సరదా, ప్రయోగం పేరుతో మొదలయ్యే అలవాటు క్రమంగా వ్యసనంగా మారే ప్రమాదం ఉంది. సామాజిక మాధ్యమాలు, సందేశ వేదికలు, అంతర్జాల ఆధారిత గోప్య లావాదేవీలు అక్రమ సరఫరాదారులకు కొత్త అవకాశాలను కల్పిస్తున్నాయి. అందువల్ల సంప్రదాయ నిఘాతో పాటు సాంకేతిక నిఘా సామర్థ్యాన్ని కూడా ప్రభుత్వాలు పెంచాల్సిన అవసరం ఉంది. విద్యాసంస్థల పాత్ర కూడా కీలకం. కళాశాలల చుట్టుపక్కల మాదకద్రవ్యాల విక్రయం జరుగుతోందా? విద్యార్థులను ఎవరైనా లక్ష్యంగా చేసుకుంటున్నారా? అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలపై యాజమాన్యాలు అప్రమత్తంగా ఉన్నాయా? అనే అంశాలపై నిరంతర పర్యవేక్షణ అవసరం. అయితే పర్యవేక్షణ అంటే విద్యార్థులపై అనవసర నిఘా కాదు. ప్రమాదాన్ని గుర్తించడం, అవగాహన కల్పించడం, అవసరమైనప్పుడు కౌన్సెలింగ్, చికిత్స అందించడం ప్రధాన లక్ష్యంగా ఉండాలి.

# పర్యాటక వైవిధ్యం.. భారత వైభవం



"ఒక దేశంలో అందమైన పర్వతాలు, ప్రాచీన దేవాలయాలు, సుదీర్ఘ తీర ప్రాంతాలు ఉన్నంత మాత్రాన పర్యాటకం అభివృద్ధి చెందదు. పర్యాటకుడు గమ్యస్థానానికి చేరుకోవడానికి మంచి రహదారులు, విమాన సౌకర్యాలు ఉండాలి. బస చేసేందుకు హోటళ్లు, వసతి గృహాలు అందుబాటులో ఉండాలి. సరైన సమాచారం, భద్రత, పరిశుభ్రత, మర్యాదపూర్వక సేవలు అవసరం. అన్నింటికంటే ముఖ్యంగా జీవితాంతం గుర్తుండిపోయే అనుభూతిని పర్యాటకుడికి అందించాలి. ప్రపంచ ఆర్థిక వేదిక రూపొందించే ప్రయాణ, పర్యాటక అభివృద్ధి సూచీ ఈ అంశాలనే ప్రధానంగా అంచనా వేస్తుంది. 2026 నివేదిక ప్రకారం ఈ దిశగా భారత్ గణనీయమైన పురోగతి సాధించింది."



**గజేంద్ర సింగ్ షెకావత్**
కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి

2014లో ప్రపంచ పర్యాటకంలో 65వ స్థానంలో ఉన్న భారత్.. 2024లో 39వ స్థానానికి, ఇప్పుడు 160 ఆర్థిక వ్యవస్థల్లో 31వ స్థానానికి చేరుకుంది. భారత్ మొత్తం స్కోరు 4.42గా నమోదైంది. ఇది 2024తో పోలిస్తే 4.3 శాతం ఎక్కువ. దక్షిణాసియా, తక్కువ-మధ్య ఆదాయ దేశాల మధ్య భారత్ మొదటి స్థానంలో నిలిచింది. ఇది కేవలం ర్యాంకులో వచ్చిన మార్పు కాదు. ప్రధాని మోదీ ప్రతిపాదించిన 'అభివృద్ధితో పాటు వారసత్వం' అనే దార్శనికతకు దక్కిన ప్రపంచ స్థాయి గుర్తింపు. 2019 సూచీలో నాలుగు ప్రధాన విభాగాలు, 90 సూచికలు ఉండేవి. 2026లో 17 విభాగాలు, 102 సూచికల ఆధారంగా దేశాలను అంచనా వేశారు. ప్రజల అభిప్రాయాలపై ఆధారపడే సూచికల సంఖ్య 33 నుంచి 18కు తగ్గింది. అంటే వాస్తవ గణాంకాలకు ఇప్పుడు ఎక్కువ ప్రాధాన్యం లభిస్తోంది. 13 సూచికల్లో ప్రపంచంలోని తొలి పది దేశాల్లో భారత్ ఉంది. విదేశీ పర్యాటకులు దేశంలో సగటున గడిపే రోజుల సంఖ్య విషయంలో భారత్ తొలి స్థానంలో ఉంది. విదేశీ పర్యాటకులు భారత్‌లో సగటున 17-18 రోజులు ఉంటున్నారు. ఇది ఇతర ప్రధాన పర్యాటక దేశాల్లో నమోదయ్యే సగటు కంటే రెండింతలు ఎక్కువ. విమానాశ్రయ అనుసంధానంలో భారత్ నాలుగో స్థానంలో ఉంది. ధరల పోటీతత్వం, హోటల్ ధరలు, కొనుగోలు శక్తి, మంచి ఆదాయం కల్పించే పర్యాటక ఉద్యోగాల విషయంలో ఆరో స్థానంలో ఉంది. రహదారి సాంద్రతలో పదో స్థానంలో నిలిచింది. దేశవ్యాప్తంగా నిర్మించిన కొత్త జాతీయ రహదారులు, మెరుగైన రైలు సేవలు, కొత్త విమానాశ్రయాలు, ప్రాంతీయ విమాన సర్వీసులు పర్యాటక రంగానికి ఊతమిస్తున్నాయి. ఉడాన్ పథకం కింద 95 విమానాశ్రయాలను 687 మార్గాలు అనుసంధానిస్తున్నాయి.

భారత్ గొప్ప బలం దాని వైవిధ్యం. ప్రయాణ వనరుల విషయంలో భారత్ ప్రపంచంలో నాలుగో స్థానంలో ఉంది. సహజ వనరుల్లో ఏడో స్థానం, సాంస్కృతిక వనరుల్లో తొమ్మిదో స్థానం, వ్యాపారం, విద్య తదితర పర్యాటకేతర ప్రయాణ వనరుల్లో ఎనిమిదో స్థానంలో ఉంది. భారీ క్రీడా మైదానాలు, ప్రముఖ విశ్వవిద్యాలయాల విషయంలో భారత్ మూడో స్థానంలో, ప్రపంచ నగరాల విషయంలో ఐదో స్థానంలో ఉంది. దీంతో భారత్ కేవలం సెలవులు గడిపే దేశంగా మాత్రమే కాకుండా సదస్సులు, క్రీడలు, విద్య, వివాహాలు, ఆధ్యాత్మికత, వైద్యం, వ్యాపార అవసరాల కోసం ప్రయాణించే వారికి కూడా ప్రధాన గమ్యస్థానంగా ఎదుగుతోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆలోచన స్పష్టంగా ఉంది. వారసత్వ సంపదను పరిరక్షించడంతో పాటు స్థానిక ప్రజల ఆర్థిక ప్రగతితో దాన్ని అనుసంధానించాలి. ఈ ఆలోచనతో పర్యాటక శాఖ కేవలం పర్యాటక ఆకర్షణలను సృష్టించడంపైనే కాకుండా, సంపూర్ణ పర్యాటక గమ్యస్థానాల అభివృద్ధిపై దృష్టి సారించింది. స్వదేశ్ దర్శన్ పథకం కింద 15 అంశాల ఆధారంగా రూపొందించిన పర్యాటక మార్గాల్లో రూ.5,295 కోట్లకు పైగా విలువైన 76 ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. వీటిలో 75 పూర్తయ్యాయి. స్వదేశ్ దర్శన్ 2.0 కింద రూ.2,207 కోట్లకు పైగా విలువైన 53 ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయి. ప్రసాద్ పథకం కింద చేపట్టిన 54 ప్రాజెక్టులు పుణ్యక్షేత్రాల్లో పరిశుభ్రత, భద్రత, సౌకర్యాలు, ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తున్నాయి. ఈ ప్రయత్నాల ప్రభావం తాజా నివేదికలో కనిపిస్తోంది.

"పర్యాటకుల రాక కొన్ని నెలలకే పరిమితం కాకుండా ఏడాది పొడవునా కొనసాగేందుకు సంబంధించిన సూచికలో భారత్ ర్యాంకు 80 నుంచి 46కు మెరుగుపడింది."

జనాభాతో పోలిస్తే హోటల్ గదుల లభ్యత విషయంలో భారత్ ర్యాంకు 117 నుంచి 84కు చేరింది. డిజిటల్ పర్యాటక సేవల వినియోగంలో 106 నుంచి 91కు, ప్రభుత్వ పర్యాటక వ్యయంలో 113 నుంచి 101కు, పర్యాటక రంగం ఆర్థిక ప్రభావానికి సంబంధించిన సూచికలో 41 నుంచి 31కు మెరుగుదల నమోదైంది. చిన్న స్థాయి అద్దె వసతి సదుపాయాల్లోనూ పురోగతి కనిపిస్తోంది. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఇటీవల ప్రకటించిన పర్యాటక డిజిటల్ వ్యవస్థ అందుబాటులోకి రావడంతో రానున్న సంవత్సరాల్లో డిజిటల్ పర్యాటక సేవల సూచిక మరింత మెరుగుపడే అవకాశం ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యాటక పెట్టుబడులకు అందిస్తున్న సౌకర్యాలు, రాయితీలతో హోటల్ గదుల సంఖ్య పెరుగుతోంది. దీంతో జనాభాతో పోలిస్తే గదుల లభ్యతకు సంబంధించిన సూచికల్లోనూ భవిష్యత్తులో మెరుగుదల రావచ్చు. ఈ పరిణామం కొత్త నగరాలు, గ్రామాలు, గృహ వసతి కేంద్రాలు, స్థానిక వ్యాపారాలకు నేరుగా ప్రయోజనం చేకూరుస్తోంది. డిజిటల్ సౌకర్యాలు ఈ మార్పును మరింత వేగవంతం చేశాయి. 172 దేశాల పౌరులకు ఇప్పుడు ఎలక్ట్రానిక్ వీసా సౌకర్యం అందుబాటులో ఉంది. సుమారు 78 శాతం వీసాలు ఎలక్ట్రానిక్ విధానంలో జారీ అవుతున్నాయి. దాదాపు 95 శాతం ఎలక్ట్రానిక్ వీసా దరఖాస్తులు 72 గంటల్లోనే పరిష్కరించబడుతున్నాయి. 'ఇన్‌క్రెడిబుల్ ఇండియా' డిజిటల్ వేదిక, 'నిధి ప్లస్', బహుభాషా పర్యాటక సహాయవాణి ద్వారా సమాచారం, సేవలను పొందడం సులభమైంది. సాంకేతికత ఇప్పుడు చిన్న హోటళ్లు, మార్గదర్శకులు, పర్యాటక నిర్వాహకులు, సేవలందించే వారిని విస్తృత మార్కెట్లతో అనుసంధానించడంతో పాటు పర్యాటకులకు మరింత సౌకర్యాన్ని అందించే సాధనంగా మారుతోంది. పర్యాటక రంగ అభివృద్ధి దేశ ఆర్థిక వ్యవస్థ, ఉపాధిలోనూ ప్రతిఫలిస్తోంది. దేశ స్థూల దేశీయోత్పత్తిలో పర్యాటక రంగం వాటా 5.22 శాతం. 2023-24లో ఈ రంగం 8.46 కోట్ల ఉద్యోగాలకు మద్దతు ఇచ్చింది. 2025లో దేశీయ పర్యాటకుల ప్రయాణాల సంఖ్య 428.55 కోట్లకు చేరింది. విదేశీ పర్యాటకుల ప్రయాణాలు 2.53 కోట్లుగా నమోదయ్యాయి. పర్యాటకం ద్వారా విదేశీ మారకద్రవ్య ఆదాయం రూ.2,76,831 కోట్లుగా ఉంది. ఈ గణాంకాల వెనుక లక్షలాది కుటుంబాల జీవనోపాధి ఉంది. పర్యాటక మార్గదర్శకులు, ట్యాక్సీ డ్రైవర్లు, కళాకారులు, నేతన్నలు, జానపద కళాకారులు, చిన్న భోజనశాలల నిర్వాహకులు, హోటల్ యజమానులు, గృహ వసతి నిర్వాహకులు పర్యాటక రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. అందువల్ల పర్యాటక అభివృద్ధి ప్రయోజనాలు నేరుగా సామాన్య ప్రజలకు చేరుతున్నాయి. పర్యాటకం దీర్ఘకాలం విజయవంతంగా కొనసాగాలంటే ప్రకృతి, స్థానిక సమాజాల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి. అందుకే పర్యాటక సుస్థిరతలో భారత్ ఏడో స్థానంలో ఉండటం ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది.

పర్యాటకుల సంఖ్యను పెంచడం మాత్రమే మా లక్ష్యం కాదు. వారు ఎక్కువ కాలం ఉండాలి, స్థానిక ఉత్పత్తులను కొనుగోలు చేయాలి, సమీపంలోని కొత్త ప్రాంతాలను సందర్శించాలి, ఆహ్లాదకరమైన అనుభూతితో తిరిగి రావాలి. పర్యాటక మిత్ర, పర్యాటక దీదీ కార్యక్రమాలు, గ్రామీణ గృహ వసతి కేంద్రాలు, పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ, స్థానిక ప్రజల భాగస్వామ్యం వంటి కార్యక్రమాలు ఈ విధానంలో భాగంగా ఉన్నాయి. అయితే ఈ విజయంతో సంతృప్తి చెందడానికి వీల్లేదు. మంచి హోటళ్లు, శిక్షణ పొందిన పర్యాటక మార్గదర్శకులు, సౌకర్యవంతమైన చివరి దశ రవాణా అనుసంధానం, మెరుగైన గమ్యస్థాన నిర్వహణ వంటి అంశాలపై మరింత దృష్టి పెట్టాలి. కృత్రిమ మేధ, డిజిటల్ సాంకేతికతను ఉపయోగించి ప్రయాణాలను మరింత సులభతరం, వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా మార్చాలి. అంతగా ప్రాచుర్యం పొందని పర్యాటక ప్రాంతాలను కూడా పర్యాటకులు సులభంగా గుర్తించి, ముందస్తుగా బస, ప్రయాణ సదుపాయాలను పొందేలా, సురక్షితంగా సందర్శించేలా అభివృద్ధి చేయాలి. ప్రయాణ, పర్యాటక అభివృద్ధి సూచీలో 31వ స్థానం గమ్యం కాదు. మనం సరైన దిశలో ముందుకు సాగుతున్నామనే దానికి ఇది నిదర్శనం. ప్రధాని మోదీ నాయకత్వంలో పర్యాటకం దేశ వైవిధ్యభరితమైన నాగరికతను ప్రపంచంతో అనుసంధానించే, ప్రతి ప్రాంతంలో ఉపాధి అవకాశాలను సృష్టించే ప్రధాన శక్తిగా మారుతోంది.

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.